నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 29-6-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 250 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

బంగారు రాష్ట్రం
అమాయక పేదలు
అంతా ఉచితం
వడ్డీవ్యాపారం
విశ్వమంతా నిండింది
అంక చండాలం
ధర బెత్తెడు
పెట్టుబడి బారెడు
ప్రాణం పోవుడు.

భూ బకాసుర
గ్రామ గ్రామాన నేడు
దుఃఖం లో ధాత్రి
రోహిణి వేడి
నిప్పులుచిమ్మేవడ
సొమ్మసిల్లుడు

– రేడియమ్
సెల్: 9291527757

నిజాలు

ఏమైతేం చల్లబడే
యమదూతపు ఎండా !
వేడెక్కి ఎగురుతుంది
రాజకీయ జెండా !.

తినీ తినీ ఒకరికొకరు
నాక్కుంటూ మూతులు !
బలబలాలు చూసుకుంటు
కాలుదువ్వు పోతులు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

బోనాల ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు.. ఓల్డ్ సిటీ బోనాలపై మంత్రి తలసాని సమీక్ష

హైదరాబాద్, జూన్ 28:బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రజలు పండుగలను గొప్పగా జరుపుకోవాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించామన్నారు. జూలై 16న హైదరాబాద్ ఓల్డ్ సిటీలో జరుగనున్న బోనాల ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సాలార్‌జంగ్ మ్యూజియంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మంత్రి తలసాని సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వివిధ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ప్రైవేట్ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వెల్లడించారు. ఓల్డ్ సిటీలోని ఆలయాలకు జులై 10న ఆర్థిక సహాయం పంపిణీ చేస్తామన్నారు.

వ్యవసాయ క్షేత్రాల్ని సందర్శించిన కలెక్టర్ జితేష్

నిజామాబాద్, జూన్ 28: మాచారెడ్డి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమగ్ర వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తున్న రైతుల వ్యవసాయ క్షేత్రాల్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం సందర్శించారు. కొత్తపల్లి గ్రామంలో సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్న శ్రీకాంత్, మల్లారెడ్డి అనే రైతులతో వారు పాటిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో సాగునీటి వసతి వుంది.. కాబట్టి రైతులు వరి పంట మాత్రమే కాకుండా కూరగాయలు, పండ్లతోటల సాగు వైపు వెళ్ళాలని సూచించారు. శ్రీకాంత్, మల్లారెడ్డి చేస్తున్న సమగ్ర వ్యవసాయ పద్ధతులు (మెషీన్ ద్వారా నాటు వేయడం, నర్సరీ, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, గొర్లు, మేకల పెంపకం మొదలగు వాటిని చూడడం జరిగింది.

మిగతా రైతులు కూడా ఈ విధంగా వ్యవసాయంతో పాటు ఇతర ఆదాయం సమకూర్చే పనులు చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత మచారెడ్డి గ్రామంలో మెహబూబ్ అనే రైతు డ్రాగన్ ఫ్రూట్ క్షేత్రాన్ని సందర్శించి, రైతు పాటిస్తున్న సమగ్ర పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ రాజు ఫౌండేషన్ రైతులతో కలిసి చేస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. జిల్లా కలెక్టర్ రైతులకు ఆదాయాన్ని పెంపొందించుకొనే వివిధ కార్యక్రమాల గురించి సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలకృష్ణ, వ్యవసాయ అధికారి రమ్యశ్రీ, సర్పంచ్ లక్ష్మణ్, అభ్యుదయ రైతులు చంద్రయ్య, రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ పులగం రాజు, వీరేశం, వినాయక్, నాగేందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

30న ఆసిఫాబాద్ జిల్లాకు సిఎం కెసిఆర్ రాక ..

హైదరాబాద్, జూన్ 28:కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీస్ కార్యాలయం,అలాగే బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయము ఈనెల 30 వ తేదీన ప్రారంభం కానున్నాయి.. వాటిని ప్రారంభించడానికి ముఖ్యమంత్రి జిల్లా కేంద్రానికి ఆ రోజు రానున్నారు..ఈ నేపథ్యంలో కెసిఆర్ పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్సీ దండే విట్టల్, జెడ్పీ చైర్మన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుల తో కలిసి నేడు జిల్లా పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిశీలించారు..

కంటి పరీక్షల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానిది ఆల్ టైం రికార్డ్: మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, జూన్ 28:సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు.. అంతటి ముఖ్యమైన కళ్లు సరిగ్గా కనిపించకపోవడం వల్ల ఎంతో మంది ఇబ్బంది పడుతుంటారని మంత్రి హరీశ్ రావు అన్నారు. స్కూల్‌కు వెళ్లే విద్యార్థి నుంచి, పండుముసలి వరకు కంటి సమస్యలతో బాధపడుతుంటారని చెప్పారు.

చిన్న సమస్యే కదా అని వదిలేస్తూ.. కాలం గడుపుతుంటారని, చివరకు అది పెద్ద సమస్యకు దారి తీస్తుందన్నారు. దీన్ని దృష్టిలోఉంచుకొని సీఎం కేసీఆర్ కంటివెలుగు అనే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, విజయవంతంగా అమలు చేశారని వెల్లడించారు. హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి దవాఖానలో ఫ్యాకో మెషీన్లను మంత్రి మహమూద్ అలీతో కలిసి హరీశ్ రావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్న పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాటరాక్ట్ సర్జరీల నిర్వహణలో ఈ అత్యాధునిక యంత్రాలు ఎంతో సహాయం చేస్తాయని తెలిపారు. అల్ట్రాసౌండ్ పరిజ్ఞానంతో పనిచేసే వీటి ద్వారా సర్జరీలు సులభంగా, వేగంగా చేసేందుకు అవకాశం లభిస్తుందని, సర్జరీ తర్వాత రోగులు కూడా తొందరగా కోలుకుంటారని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12 ఫ్యాకో యంత్రాలను ఏర్పాటు చేశామని, వీటన్నింటినీ ఇప్పుడు ఒకేసారి ప్రారంభించుకున్నామని వెల్లడించారు. సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో కూడా రెండు మెషిన్లు ఏర్పాటు చేశామన్నారు. మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో, మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంనగర్, వికారాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలో ఒక్కో యంత్రం అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఒక్కో ఫ్యాకో యంత్రం ఖరీదు రూ.28.85 లక్షలు అనీ, మొత్తంగా 12 యంత్రాలకు కలిపి ప్రభుత్వం రూ.3.46 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు.

ప్రైవేటులో రూ.30 నుంచి రూ.40 వేలు అయ్యే సర్జరీ పేదలకు ఉచితంగా అందనుంది.

సర్జరీ నిర్వహించడానికి వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలు గుర్తించిన వారికి ఈ ఫ్యాకో మిషన్ల ద్వారా అవసరమైన చికిత్స అందనుంది. అంధత్వ రహిత తెలంగాణ సాధన కోసం ప్రారంభించిన కంటి వెలుగు.. రెండు దఫాల్లో విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఎవరూ అడగకముందే,

ఇంటి పెద్దకొడుకుగా ఆలోచించిన కేసీఆర్ ప్రజల కంటి సమస్యలను దూరం చేసేందుకు ఈగొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

'గ్రామాలకు వైద్య సిబ్బంది వచ్చి.. ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అద్దాలు అందించే కార్యక్రమం ప్రపంచంలో తెలంగాణలో మినహా మరెక్కడా లేదు. 100 పని దినాల్లో కోటి 62 లక్షల మందికి కంటి పరీక్షలు చేశారు.

ఇందులో దృష్టి లోపంఉన్న 40.59 లక్షల మందికి అంటే 25.1 శాతం మందికి అద్దాలు పంపిణీ చేశారు. అందులో 22.51 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు అందించాం.

18.08 లక్షల ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కూడా ఉచితంగా పంపిణీ చేశాం. ఇంత పెద్ద మొత్తంలో కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, మందులు పంపిణీ చేసిన ఘనత బీఆర్ఎస్‌కుకు తప్ప ప్రపంచంలో మరే ప్రభుత్వానికి లేదు. కంటి పరీక్షల్లో తమది ఆల్ టైం రికార్డ్ అని మంత్రి హరీశ్ రావు చెప్పారు.

ఈ విద్యా సంవత్సరం నుండే ఖమ్మం వైద్య కళాశాలలో తరగతులు..

ఖమ్మం, జూన్ 28: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి 100 సీట్లతో తరగతులు ప్రారంభం కానున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మీడియాకు తెలిపారు. బుధవారం పాత కలెక్టరేట్ భవనంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తో కలసి పువ్వాడ కొనసాగుతున్న పనులను పరిశీలించారు. మెడికల్ కళాశాల పనులు చురుగ్గా సాగుతున్నాయని, అనుకున్న సమయానికి పనులన్నీ పూర్తి చేసి తరగతులు నిర్వహిస్తామన్నారు. తరగతి భవనాలు, అందులో సౌకర్యాలు, ప్రయోగశాలలు, అధ్యాపక బృందం, విద్యుత్, వివిధ విభాగాల ల్యాబ్ లు, తరగతి గదులు, లైబ్రరీ, టాయిలెట్స్, త్రాగునీరు, పార్కింగ్, గ్రీనరీ, ఇతర మౌలిక సదుపాయాలను కలియ తిరిగి పరిశీలించారు.

పాత కలెక్టరేట్ భవనం 5ఎకరాలు, ఆర్ అండ్ బి కార్యాలయంలోని 3ఎకరాలు మొత్తం 8 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఆయా తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఎదురుగా మెడికల్ కళాశాల, విద్యార్థులు, అధ్యాపకుల వసతి గృహాలు ఉండాల్సి ఉందని, అందుకోసం ప్రభుత్వం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న పాత కలెక్టరేట్ భవనం లో రూ.9 కోట్లతో ఆధునీకరించి అక్కడ తరగ తులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఇప్పటికే కళాశాల నిర్మాణం కొరకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.166కోట్లను ఏర్పాటుకు ఇప్పటికే అనుమతిస్తూ మంజూరు చేసిందని తెలిపారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాలు ఖమ్మంలో వందసీట్లతో వైద్య కళాశాల జారీచేసిందని, దీంతో ఖమ్మంజిల్లా ఆసుపత్రి వైద్య కళాశాలగా ఈ విద్యా సంవత్సరం నుంచే సేవలందించబోతోందన్నారు. ఇప్పటికే ఖమ్మం ఆసుపత్రిలో ఉన్న అధునాతన పరికరాలు, సౌకర్యాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగున ఉన్న మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని సరిహద్దు జిల్లాల నుంచి కూడా వైద్యం కోసం రోగులు వస్తున్నారని, దీంతో ఖమ్మం మెరుగైన వైద్యానికి కేంద్రంగా ఇప్పటికే గుర్తింపు పొందిందని, రానున్న రోజుల్లో ఖమ్మం వైద్య రంగానికి హబ్ గా నిలువనుందన్నారు..

కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం ప్రకారం అనుమతి లభించిన దరిమిలా తరగతుల నిర్వహణకు సిద్ధంగా ఉందన్నారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ : మంత్రి పువ్వాడ

ఖమ్మం, జూన్ 28: (నేటినిజం ప్రతినిధి): దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సందర్భాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించిన గొప్ప నాయకుడు, సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహ రావు అని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. నేడు పీవీ 102వ జయంతి సందర్భంగా ఖమ్మం నగరం లాకారం సర్కిల్ నందు గల పీవీ విగ్రహానికి మంత్రి పువ్వాడ, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ లు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పీవీ అని, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం వారి సేవలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ తగినరీతిలో గౌరవిస్తుందన్నారు. పీవీ సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని మంత్రి పువ్వాడ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్ లు కర్నాటి కృష్ణ, చిరుమామిళ్ళ లక్ష్మి, ఆళ్ళ నిరిషా అంజి రెడ్డి, రాపర్తి శరత్, కురాకుల వలరాజ్, ఖీఏఅ కృష్ణ, ఈశ్వర హరిబాబు, కొల్లు పద్మ, వనం కృష్ణవేణి, సతీష్, రవికాంత్, ఓం కరీం, తదితరులు పాల్గొన్నారు.

జులై మూడో వారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

న్యూఢిల్లీ, జూన్ 28:పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కేంద్రం సిద్ధమవుతోంది. జులై మూడో వారం నుంచి ఈ సమావేశాలు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే సమావేశాల తేదీలను అధికారికంగా ప్రకటించనప్పటికీ.. జులై 17 లేదా 20వ తేదీన సమావేశాలు ప్రారంభమవుతాయని, ఆగస్టు 10న ముగియవచ్చని తెలిపాయి. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ ఒకటి రెండు రోజుల్లో తేదీలను ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అయితే, ఈ సమావేశాలు కొత్త పార్లమెంట్ భవనంలో జరుగుతాయా లేక ప్రస్తుతం ఉన్న భవనంలోనే కొనసాగుతాయా అనే విషయంలో మాత్రం స్పష్టత రావాల్సి ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెల రోజులక్రితం కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించినప్పటికీ.. అందులో ఇంకా కొన్ని పనులు కొనసాగుతున్నాయి.

కొత్త పార్లమెంటు భవనం సమావేశాలను నిర్వహించడానికి పూర్తిగా సిద్ధం కాకపోతే.. పాత భవనంలోనే వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశం ఉండొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, ఈ సమావేశాల్లో ఢిల్లీపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రధానంగా నిలిచే అవకాశం ఉంది.

పీవి 102వ జయంతి -కెసిఆర్ తో సహా పలువురు నేతల నివాళి..

హైదరాబాద్, జూన్ 28:మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా కుటుంబ సభ్యు లు, వివిధ పార్టీల నేతలు ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని నెక్లెస్‌రోడ్డులో ఉన్న పీవీ జ్ఞానభూమి వద్ద అంజలి ఘటించారు. పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ వాణీదేవితో పాటు ఇతర కుటుంబసభ్యులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు నివాళులర్పించారు. మంత్రులు మహమూద్ అలీ, తలసాని, సత్యవతి రాథోడ్, భాజపా ఎమ్మెల్యే ఈటల రాజేందర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ తదితరులు పీవీకి నివాళులర్పించారు. దేశానికి, తెలంగాణకు పీవీ నరసింహారావు అందించిన సేవలను ఈ సందర్భంగా నేతలు గుర్తుచేసుకున్నారు.

క్లిష్ట సమయంలో దేశాన్ని కాపాడిన తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. నాడు పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలే నేడు దేశ ప్రజల అనుభవంలోకి వచ్చాయని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా ఆయన సేవలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. పలు సంస్కరణలతో భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడారని తెలిపారు. పీవీ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని వెల్లడించారు. తెలంగాణ ఠీవీ.. మన పీవీ అని చెప్పారు. పీవీ స్ఫూర్తితో దేశాభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని సీఎం కేసీఆర్ అన్నారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ పీవీ నరసింహారావు మారుమూల గ్రామంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగారన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా ఆయన వస్త్రధారణ ఉండేదని చెప్పారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని.. ఈ విషయం లో భారాస పోరాడుతుందని చెప్పారు. దేశ రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు పీవీ స్ఫూర్తిదాయకమని మరో మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పీవీ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నివాళి అని చెప్పారు.ఆనాడే నిరంకుశత్వానికి వ్యతికేకంగా పీవీ నరసింహారావు పోరాడారని ఈటల రాజేందర్ చెప్పారు.

ఆయన బహుభాషా కోవిదుడని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన బిడ్డ పీవీ అని ఈటల కొనియాడారు.

హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో ఉన్న శాసన మండలిలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, పీవీ కుమార్తె ఎమ్మెల్సీ వాణిదేవి, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ పాల్గొన్నారు.

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

(ప్రథమ)

నా మది నివేదన

యేమని నివేదించను నీకు
నా ఆవేదన నా మది నివేదన
నీ నిన్నటి ముని వేళ్ళ స్పర్శ నా
అందెలలో ప్రతీ మువ్వా
ముసి ముసిగా నవ్వుతుంది
నీ ముని పంటి గాటులో
ఎరుపెక్కిన అధరాలు నీకై
ఆత్రంగా చూస్తున్నాయి
తిరిగి నీ రాకకోసం అనుక్షణం
అణువణువు వెతుకుతూనే ఉన్నాయి.
నీ గతకాలపు జ్ఞాపకాలనుండి
వర్తమానంలో బ్రతలేక
భవితపై తలపు రాక
భూత కాలంలోనే ఒంటరిగా
బ్రతుకుతున్న.....
నువ్వు తిరిగి వస్తావన్న ఆశ
రావేమో అనే నిరాశల మధ్య
మెదడుకు మనస్సుకు మధ్య
తగవులతో నా ఉచ్వాశ నిశ్వాసలు

(ద్వితీయ)

నీకోసం నాతో
నిశ్శబ్ద యుద్ధం చేస్తున్నాయి
ఏమనుకున్నావో ఏమో
మోయలేని ఈతీపి భారాన్ని
నాపైన మోపి ఏతీరాలలో
ఏ తీరులో ఉన్నావో తెలియక
సతమత మవుతున్న నీ ప్రియమైన
ప్రణయ శత్రువుని.
నిన్నటి ఆవేదనని
నా మదినివేదనని నీకై
నివేదించ యెదురు చూస్తున్న
నీ ఒకప్పటి నీలో సగాన్ని
నా హృదయ రాయభారాన్ని
అందుకుని నా భారాన్ని
పంచుకుంటావని నీకై వేచి ఉన్న
నీ నేను.....

–దుర్గా మహా లక్ష్మి ఓలేటి
7702010056

నిన్నటి వేదన

గుండె గాయమైన కాలం ఒడిలో
అంతర్గత జ్ఞాపకాలు తడులు
నిన్నటి వేదనను మోస్తునే వున్నాయి
చీకటి శోకం మిగిల్చిన
హృదయ ఆవేదనపు చితిమంటలు
అగ్నిలా దహిస్తుంటే
బ్రతుకు తెరువు నౌక
అలల కెరటాలపై సాగిపోలేక!
ఆవేదనల పెనుభారం
కుంపటై తిష్ఠ వేస్తున్నది
జీవనతరంగాల సంవేదనల మధ్య
గడిచిన మధురస్మృతుల
మజిలీలు కొన్ని
పునాదుల భవిష్యత్తు గమనం పై
చెమటదారలతో
మెట్టు మెట్టుకి ఊపిరిపోసి
అంతర్లోచన
స్వర్గ భవంతిని నిర్మిస్తే...!.
మెతుకు బువ్వకు
కన్నీటి ఆకాల వర్షాలు వచ్చి
శ్రమరక్తం వరదలు పోతుంటే
బతుకు తెరలపై
నిన్నటి వేదన
ప్రదర్శిస్తుంటే..
జ్ఞాపకాల తడితో
నా హృదయం ఛిద్రమై పోతుంది.

–డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

స్వతంత్ర జర్నలిస్ట్ తులసి చందు

మద్దతుగా
సంఘీభావ సభ & కవి సమ్మేళనం
తేదీ:30-06-2023శుక్రవారం
సాయంత్రం 6గంటల నుంచి
స్థలం: ప్రెస్ క్లబ్ , గాంధీనగర్ విజయవాడ.
వివరాలకై : తంగిరాల సోని 9676609234
శిఖాఆకాష్ 93815 22247
నిర్వాహణ : బహుజన రచయితల వేదిక

నేటి కందం– నేటికి అందం

కం॥ ఘనమగు కరిరాజుకనమున
కునుమశిరసళమతరమున కును - మట్టాటలం
బును జిట్టాలిండలముగా
మనమున నే- గాంబడునుష్టమండల వేళనొ॥

–రాధశ్రీ
సెల్:9494481210

జూన్ 29 అంతర్జాతీయ ఉష్ణ మండల దినం
June 29 International day of Tropics)

వివేక వాణి



–బండిరాజుల శంకర్

ఆహ్వానము
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
ప్రపంచ రికార్డులు నెలకొల్పిన శ్రీత్యాగరాయ గానసభ

" కవిశేఖర " శ్రీ జన్నా భట్ల నరసింహప్రసాద్ రచించిన
" వ్యాస మంజూష " గ్రంథావిష్కరణ - డా॥ హిప్నో పద్మాకమలాకర్ గారికి
అంకితోత్సవం మరియు జన్నాభట్ల నరసింహప్రసాద్ కథలు,
నవలికలు - పరిశీలన పై పరిశోధన గావించి డాక్టరేట్ పొందిన
డా॥ మట్టా హారిక, విజయవాడ అభినందన సత్కారం

ముఖ్య అతిథి :
పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్
ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి

గౌరవ అతిథి : ప్రొ॥ ముదిగొండ శివప్రసాద్ చారిత్రక నవలా చక్రవర్తి
సభాధ్యక్షులు : శ్రీ పాత్తూరి సుబ్బారావు సంపాదకులు, సాహితీ కిరణం
సభాప్రారంభం : శ్రీ కళా వి.ఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ
అతిథుల సత్కారం : శ్రీ బైస దేవదాసు సంపాదకులు, నేటి నిజం
పుస్తక సమీక్ష : శ్రీ పెద్దూరి వెంకటదాసు కవి, రచయిత
జోతి ప్రకాశనం : శ్రీమతి శేషబట్టార్ రజిత ఆచార్య కూచిపూడి నాట్యగురువు

కృతి స్వీకర్త

డా॥ హిప్నో పద్మాకమలాకర్

స్పందన :
డా॥ హిప్నో పద్మాకమలాకర్
డా॥ మట్టా హారిక,
శ్రీ జనాభట్ల నరసింహప్రసాద్

అభినందన సత్కార స్వీకర్త

డా॥ మట్టా హారిక, విజయవాడ

సాంస్కృతిక కార్యక్రమం : సంగీత విభావరి
గానం : శ్రీ లక్ష్మీనరసింహ సంగీత కళాశాల ప్రిన్సిపాల్, సంగీత గురువు, నాగారం, శ్రీమతి జన్నా భట్ల లక్ష్మీకామేశ్వరి గారి శిష్యులు, మెరుగు విష్ణు భగవాన్, టి. అర్జున్, టి. చరణ్, డి. ధ్రువ్, కె. సత్యసాయిసుజయ్, కె. యశశ్విన్, గానవి, గొర్తి శ్రీధన్వి
కూచిపూడి నృత్యం: బేబి శేషభట్టార్ ఆరోహి శరణ్య

08-07-2023, శనివారం, కళాసుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.

లయన్ గుచిలండి వెంకటరెడ్డి, ఛైర్మన్
లయన్ వి.వి. రాఘవరెడ్డి
ప్రధాన కార్యదర్శి , జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్

శ్రీమతి కళా శారదా దీక్షితులు
ప్రధాన కార్యదర్శి, శ్రీత్యాగరాయ గానసభ

నేటినిజం
సాహితీ కిరణాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 29-6-2023

నానీ

నీ కోసం
ఎప్పుడూ ఎదురుచూపే
నీ మనసు తెలిశాక
కాలానికి ఫుల్‌స్టాప్!

-డా. సి. భవానీదేవి
9866847000

గుంపురాలం

మాట మార్చటమంటే
బాట మార్చటమే
నమ్మకాల మూటను
నట్టేటా ముంచటమే.

నేలను చాపలా చుట్టి
నింగిని గుప్పిట పట్టాను
నన్ను నేనను కనిపెట్టలేని
చీకటిలోనే ఉన్నాను.

దగ్గరైతే
ధైర్యం
దూరమైతే
దైన్యం.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

పుస్తక సమీక్ష

'భాస్కరోక్తులు' శతక సూక్తులు

డా॥ నలిమెల భాస్కర్ నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా నారాయణపురంకు చెందినవారు. వీరు పద్నాలుగు భారతీయ భాషలు నేర్చుకుని ఒక భాషలోంచి మరొక భాషలోకి అనువాదాలు చేస్తున్న వారు. పండితులు, కవి, రచయిత, పరిశోధకులు. 1974 నుండి ఇప్పటి వరకు ఎన్నో రచనలు చేసారు. కొన్ని పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. వారి యొక్క రచనలలో **"భాస్కరోక్తులు"** శతక పద్యాల రచన ప్రత్యేకమైనది. ఈ భాస్కరోక్తులు "డా॥ నలిమెల భాస్కర్ గారు బి.ఇడి. విద్యార్థిగా రాసుకుని, భద్రంగా దాచుకున్న శతక పద్యాలు. నేటికీ ఈ పద్యాలు తాజాగా ఉండడమే కాక కాలానుగుణంగా కనిపించడం ఈ పద్యాలలోని విశేషం. డా॥ నలిమెల భాస్కర్ గారు **"వాస్తవమ్ము దెల్పు భాస్కరోక్తి"** అనే ఏకపాదమకుట ముతో ఈ భాస్కరోక్తులు శతక రచన చేసారు. ఇందులోని పద్యాలు కఠినమైన సంధులు, దీర్ఘ సమాసాలు లేకుండా అందరికి అర్థమయ్యే విధంగా వాడుక భాషలో సహజంగా ఉన్నాయి. శతక పద్యాలు నైతిక, ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక, మానవీయ విలువలను అందించేవిగా, పెంపొందించేవిగా ఉంటాయి. "భాస్కరోక్తు"ల్లోని పద్యాలు కూడ అదే విధంగా ఉన్నాయి.

> పద్నాలుగు భారతీయ భాషలు నేర్చుకుని ఒక భాషలోంచి మరొక భాషలోకి అనువాదాలు చేస్తున్న పండితులు, కవి, రచయిత, పరిశోధకులు
> డా॥ నలిమెల భాస్కర్

"పలుకు వెలది నీకు పలుకయిమోద్పులు! సానుభూతి చూపు చదువులమ్మ"। ప్రజ్ఞనిచ్చి పామరత్వమ్ము పరిహార్పు" అనే పద్యముతో ఈ శతక రచన ప్రారంభించారు. మూడు పాదాలలో ఆ చదువులతల్లిని అభ్యర్థించడం విశేషంగా ఉంది. ఈ పద్యం పోతన **"అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ"** అనే పద్యము స్ఫురణకు తెస్తుంది. ఈ పద్యం ప్రతిదినము పిల్లలు తేలికగా పాడుకునే విధంగా ఉంది. "కవి తల" నిరతమ్ము కవితల యోచించు। సైరికుండు పెంచు సస్యములను"। అని కవి కలము, రైతు హలము ద్వారానే సమాజము జ్ఞానవంతమౌతుందని, ఆకలి బాధలు పోతాయని ఆ సందర్భముగా **"కలము హలములె కలకలమ్ముల నణచురా"।** అని తెలిపారు. "గాంధి పేరు మీద బ్రాంది షాపులు వెల్సె" అనే పద్యంలో, మద్యపాన నిషేధం చేయాలని చెప్పిన గాంధీ పేరు మీదనే బ్రాంది షాపులు వెలవటం కవికి నచ్చలేదు. **"కుంటి వాడొకండు గుడిముందు నిల్చుండి ఈసడించు కొనును ఈ జనమ్ము"** అంటూ చెప్పే ఈ పద్యంలో మానవ సేవయే మాధవ సేవ అన్న సూక్తిని మరచిన రీతిని చెప్పాడు. **"తండ్రి సత్యమూర్తి, తల్లి శాంత స్వభావి"।** అన్న పద్యం ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతుంది. పిల్లలను కనడమే కాదు వారిని సరిదిద్దే బాధ్యత తల్లిదండ్రులది అని తెలుపుతుంది.

పెళ్లి చూపుల తంతులో తన రూపము కానక బొమ్మలాంటి అమ్మాయి రూపంను వంకబెట్టు ప్రబుద్ధుల గురించి **"పెళ్ళి చూపులకని వెళ్ళి వచ్చినవాడు"** అన్న పద్యంలో రాసారు. కట్న కానుకలకు ఆశపడు కాసుధ్యాస తప్ప కన్నులు కానవు అని **"కట్నమేమో చూడ ఘనముగా పదివేలు! పిల్లమోము చూడ మెల్లకన్ను!"** అన్న పద్యంలో చెప్పారు. **"ఎదుటి వాని తప్పులెన్నగా సులభమ్మె! తలచవలెను మనిషి తనదు తప్పు॥"** అనే పద్యం **"తప్పు లెన్ను వారు"** అనే వేమన పద్యంలాగ ఉంది. ఈ పద్యంలో గురిగింజ తన నలుపు ఎరుగనట్లు మనిషి తన తప్పు ఎరుగక ఇతరుల తప్పులు ఎంచుతాడు అని చెప్పారు. **"మాట దాచనట్టి మనిషి సచ్ఛీలుండు నల్లికుట్లతనము నమ్మవద్దు"** అనే పద్యంలో నల్లి మంచాన్ని పట్టుకొని కనబడకుండా ఉండి రాత్రి సమయములో బయటకు వచ్చి కుట్టినట్లు కొందరు వ్యక్తులు కూడ ఏమి అనకుండ ఉన్నట్లు కనిపించినా సమయము చూసి నష్టపరుస్తారు అని చెప్పారు. **"విద్య బండిసున్న విజ్ఞానము హుళక్కి ఓనమాలు సరిగ రానివాడు"** అంటూ సర్టిఫికెటుల చదువు అయి పోయిందని జ్ఞానము మాత్రము లేదని ఈ పద్యంలో ఉంది. **"పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడె పుట్టదు"** అనే సుమతి శతక పద్యం కొడుకు పుట్టగానే సంతోష పడకండి ఆ కొడుకు ప్రయోజకుడై నలుగురి మన్నన పొంది నపుడు సంతోషపడాలి అని తెలుపుతుంది. ఐతే కొడుకు ప్రయోజకుడు కావాలని తండ్రి చదువులకని డబ్బులు పంపించగానే సరిపోదు. ఆ కొడుకు ఏంచేస్తున్నాడో తెలుసుకోండి అనే భావనతో చెప్పిన పద్యం ఇందులో ఉంది.

చెప్పిందే చేయాలే, చేసేదే చెప్పాలే అని అంటారు. కానీ **"చేసి చెప్పినపుడే చేటు తొలుగు"** అని అపుడే **"పండు కలలు పండుతాయని। పసిడి వానలు కురుస్తాయని"** ఈ పద్యం తెలుపుతుంది. "రామకృష్ణ" యనెడు రాములయ్యలు గూడ" దమ్ము కొట్టు దమ్ము రమ్ము అనిరి బాలలెల్ల వారి బాటనే నడవరా అని ఒక హెచ్చరిక ఈ పద్యంలో కనిపిస్తుంది. పెద్దవారి మాట పెరుగన్నము మూట అంటారు. అందుకోసం పెద్దవారి మాట అనుసరణీయమైనదిగా ఉండాలి. చిత్తం శివుని మీద భక్తి చెప్పుల మీద అన్నట్టు కొందరు గుడికి వెళ్ళిన వారి మనసు ఇతర వ్యాపకాల మీదనే ఉంటుంది. దీనిని **"ఆలయమ్ము చుట్టు అయగారు తిరుగాడు। ఉల్లమేమొ క్రొత్త జోళ్ళ మీద"।** అనే పద్యంలో చక్కగా చెప్పారు. శాస్త్రీయనాట్యము సాక్షాత్తు నటరాజస్వామి సృష్టి అంటారు. అలాంటి నృత్యానికి ఆదరణ తగ్గిందని **"కల్లు తాగినోడి ఒళ్ళు తూలు విధము"** ఈనాటి పాశ్చాత్య నృత్యాలు ఉన్నాయి అని తెలుపు పద్యం ఉంది. **"పరువమందు ప్రేమ ప్రథమ దర్శనమందె శాశ్వతమయినపుడె సార్థకమ్ము"** అని యువతకు ఒక హితబోధ లాంటి పద్యము ఇది. ప్రేమ అంటే తొలిచూపుల ఆకర్షణ కాదు చివరి చూపు వరకు ఉండాలి అని చెప్పిన పద్యం. ఒక రోజు కూడ పుస్తకము ముఖం చూడని విద్యార్థి రేపు పరీక్షలు అనగ చదివితే ఏం జ్ఞానం కలుగుతుంది అని **'ఎపుడు బుక్కు ముఖము నెఱుగని విద్యార్థి।"** అనే పద్యంలో ఉంది. నాగరికత అంటే పాశ్చాత్య అలవాట్లు అలవరచుకోవడం కాదు, నాగరికత అంటే ఆటవికత కాదు అని,**" క్లబ్బు క్లబ్బు నందు క్యాబరే డాన్సులు సందు సందు కొక్కసానికొంప॥ నాగరికత యెంత నడుమంత్రమాయెరా।"** అని తెలిపారు.

ఏ భాషను నేర్చిన ఏ భాషను మాట్లాడినా దాని భావన మాత్రము మాతృభాషలోనే ఉంటుం ది. అలా మాతృభాషయైన తెలుగులో చదివిన వారి జ్ఞానం అధికం గాని అల్పం కాదు అని తెలుపుతూ **"తెలుగు మీడియమ్ము" వెలుగు జూపిన వారు। తెలివి హీనులనుచు తిట్టనేల?।** అను పద్యం ఉంది. భిన్నత్వములో ఏకత్వము చూపాలి ముక్తి పొందాలంటే ఖురానులైన, పురాణమైన చదివితే కాదు, **"కులమతాల గోడ కూల్చరా యికనైన"** అనే పద్యంలో తెలిపారు. **"దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మించబడుతుంది"** అని కొఠారి కమీషన్ తెలిపింది. ఆ నిర్మాతలు బడిపంతుళ్ళు **"బ్రతక లేనివాడు బడి పంతులగునన్న! మాట నిపుడు రూపుమాపలయు"** అని ఈ పద్యంలో తెలిపారు. "పరిహసించెనొక దుపాధ్యాయ వృత్తి రా బదులు లేనిదంచు బదులయందు। అన్న పద్యం విద్యను వ్యాపారముగ మార్చిన ప్రస్తుత పరిస్థితులను తెలిపే విధంగా ఉన్నది. ఫ్యాషన్ ప్రపంచమంటూ వస్త్రధారణ సరిగ్గా లేనితనాన్ని, సరైన వస్త్రాలు కొనలేనితనాన్ని **"ఒకతె బట్టలేక ఒళ్ళు సగము గప్పు। బట్టలుండి యొకతె కట్లు సగము"।** అను పద్యం తెలుపుతుంది.

'నాపేరు ప్రజాకోటి నా ఊరు ప్రజావాటి' అని దాశరథి కృష్ణమాచార్యులు' చెప్పినట్లు డా॥ నలిమెల భాస్కర్ గారు కూడ **"ప్రజల కవిని నేను - ప్రజలె నాకూపిరి"।** **"ప్రజల చీకుచింత ప్లాటు నాకు"** అని చెప్పారు. ఆనకట్టల యొక్క ప్రాముఖ్యతను తెలుపుతు "నదుల జలములన్ని ఉదధి పాల్జేయక। పట్టుబట్టి ఆనకట్ట గట్టి" అను పద్యం ఉంది. ప్రజలు మూఢనమ్మకాలు వదిలి విజ్ఞానం కలవారు కావాలని ఆకాంక్షిస్తూ **"మందులివ్వకుండ మైసమ్మ యని మ్రొక్క। వ్యాధి ముదిరి మృత్యువాత బడియె"।** అను పద్యం రాసారు. నిత్యం పూజలందుకునే అర్హతగల వారు రైతు, గురువు, సైనికుడు. వారే జాతి శాశ్వతముగా అభ్యుదయం చెందటానికి స్తంభాలు అని **"పూజలంద ఈ త్రిమూర్తులే యర్హులు"** అనే పద్యంలో తెలిపారు. **"పరిహరించు మద్యపానమ్ము ప్రాణమ్ము"** అని, **"ప్రజల డొక్క నింపు వాడొక్కడే రైతు"** అని, **సాయపడియెడు వ్యవసాయమ్ము శ్రేయమ్ము"** అని సూక్తుల్లాంటి పద్యపాదాలు ఎన్నో ఈ శతకంలో ఉన్నాయి.

డా॥ నలిమెల భాస్కర్ గారు అనేక ప్రక్రియలలో రచనలు చేసారు. ఈ శతక రచన వారికి ప్రత్యేకమైనది. భాషా పరిశోధకులు కాస్త పద్య శోధకులయ్యారు. అల్ప పదాలతో అనల్పార్థ రచన చేసారు. ఈ పద్యాలలో కొన్ని చోట్ల జాగ్రత్త చెప్పారు. కొన్ని చోట్ల హెచ్చరించారు. కొన్ని చోట్ల ప్రశంసించారు. కొన్ని చోట్ల ఎరుక చేసారు. అందువలన భాస్కరోక్తులు శతక రచన పిల్లలు, పెద్దలు అందరు చదువదగినది.

ప్రతులకు :
డా॥ నలిమెల భాస్కర్
సెల్ : 9704374081

-కట్ట రజిత
సెల్ : 6300003059

కూరెళ్ళకు 'కిన్నెర-ద్వానా శాస్త్రి' స్మారక పురస్కారం

సమాజహితంకోరే సాహిత్యం రావాలని, దీని కోసం ప్రతి సాహితీ వేత్త కృషి చేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, ద్వానా సాహితీ కుటీరం సంయుక్త ఆధ్వర్యంలో డా॥ ద్వా.నా.శాస్త్రి 76వ జయంతి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రముఖ కవి, రచయిత డా॥కూరెళ్ళ విఠలాచార్యఉ కిన్నెర-ద్వారా శాస్త్రి స్మారక నగదు పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ లక్ష్మణ్ పురస్కార గ్రహీత విఠలాచార్యను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రం థాలయాలు ఏర్పాటు చేయగలిగితే యువతలో ఆలోచనా పరిజ్ఞానం పెరుగుతుందని, ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం వుంటుందని పఠనాశక్తి పెరగడం వల్ల మెరుగైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. కూరెళ్ళ విఠలాచార్యగారు తన గ్రామంలో స్వంత వేలు చేకూరుస్తున్నారని కొన్నివేల గ్రంథాలు సేకరించి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ద్వానా శాస్త్రి జయంతిని పురస్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కిన్నెర సంస్థ చేస్తున్న సామితీ సేవ గొప్పదని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిందని కాబట్టే విఠలాచార్యకు గుర్తింపు లభించిందన్నారు.

చాలా మంది సాహితీవేత్తలు స్వరాష్ట్రంలోనే వెలుగులోకి వచ్చారన్నారు. ద్వానా శాస్త్రి జయంతిని పురస్కరించుకొని పురస్కారం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, బైస దేవదాసు,ద్వాదశి శశికాంత్, ముద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

కూరెళ్ళ విఠలాచార్యను సత్కరిస్తున్న జస్టిస్ లక్ష్మణ్,డా॥ కె.వి.రమణాచారి, మద్దాళి రఘురామ్, బైస దేవదాసు, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, డా॥ ఓలేటి పార్వతీశం, ద్వాదశి శశికాంత్

'తెలంగాణ సాహిత్య అవలోకనం' గ్రంథావిష్కరణ

భారత్ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్తులో రవ్వా శ్రీహరి ప్రాంగణంలో, బాల శ్రీనివాసమూర్తి వేదికపై నిర్వహించిన తెలంగాణ సాహిత్య సభలలో సమర్పించిన పరిశోధనా పత్రాల సమాహారం "తెలంగాణ సాహిత్య అవలోకనం" గ్రంథ ఆవిష్కరణలో భారత జాగృతి అధినేత్రి శాసనమండలి సభ్యురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గ్రంథ ఆవిష్కరణ చేశారు. ఈ సభలో శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్, ప్రసిద్ధ సాహితీమూర్తులు జితేందర్ బాబు, డాక్టర్ అయాచితం శ్రీధర్, అనిశెట్టి రజిత, తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్, కాంచనపల్లి, రంగు నవీనాచారి, కోదారి శ్రీను, పులి జైపాల్, ఘనపురం దేవేందర్.

'క్రియ ఒక జీవన లయ' పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణలో మద్దాళి రఘురాం, కుడికాల వంశీధర్, ఆచార్య ఎన్.గోపి, ఆవిష్కర్త కె. రామచంద్రమూర్తి, డా॥ఓలేటి పార్వతీశం, వంగల హర్షవర్ధన్ తదితరులు.

నేటినిజం పత్రిక పక్షాన ఆచార్య ఎన్.గోపికి జ్ఞాపికను బహూకరిస్తున్న డా॥ భీంపల్లి శ్రీకాంత్, ఘనపురం దేవేందర్.

ఆచార్య ఎన్.గోపి రచనలు ఈ తరం యువతకు ఆదర్శంగా ఉంటాయని సినీయర్ జర్నలిస్ట్ కె. రామచంద్రమూర్తి అన్నారు. ఆది వారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డా॥ఎన్.గోపి రచించిన కవితా సంపుటి **'క్రియ ఒక జీవన లయ'** పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజహితం కోరే సాహిత్యం రావాలని అన్నారు. డా॥ ఎన్.గోపి రచనలు ఎంతో మందికి స్ఫూర్తి అని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రచయిత వంగల హర్షవర్ధన్, డా॥ ఎస్.రఘు, కుడికాల వంశీధర్, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు. డా॥ భీంపల్లి శ్రీకాంత్,నేటినిజం పత్రిక పక్షాన ఆచార్య ఎన్.గోపికి జ్ఞాపికను బహూకరించారు.

మనసు ఖాళీ అవ్వాలి..!

కృతజ్ఞతనో కృతఘ్నతనో
ప్రేమో ద్వేషమో..
మంచో చెడో ఏదో ఒకటి
లోని దంతా కక్కేయ్యాలి..

మొన్నటిదీ నిన్నటిదీ
ఇవ్వాళ్టిదీ అంతా
సంశేషం లేకుండా
ఏ శేషం లేకుండా
కూడేసుకునీ కుప్పేసుకునీ
మనసెంత బరువైపోయిందో
హృదయమెంత దరువై పోయిందో

చెప్పాలనుకున్నదేదో చెప్పేయ్యాలి
దాచుకోకుండా దాటవేయకుండా
ఏ సుత్తీ లేకుండా ఏ స్తుతీ లేకుండా
విప్పాల్సిన చిక్కుముళ్ళన్నీ
వెప్పేసి స్వేచ్ఛగా ఊపిరి పీల్చాలి.

అవును ఇప్పుడే ఈ క్షణమే
మట్లాడాలి మాట్లాడాలనుకున్నదంతా
నిర్మొహమాటంగా మాట్లాడేసేయాలి
చెప్పలేక అవకాశంరాక
దిగమింగుకున్న దిగులునంతా
పటాపంచలు చెయ్యాలి
వాయిదాలువద్దు వాదోపవాదాలువద్దు
ఆసాంతం అలవోకగా
కలగలుపుగా ఒంపేసుకోవాలి
మనసంతా తేలికవ్వాలి..
ఖాళీ అవ్వాలి..!

- డాక్టర్ .కటుకోర్ఝుల రమేష్
సెల్:9949083327

నానీలు

-కొత్తపల్లి ఉదయబాబు
9441860161

విభజించి పాలించేది
రాజకీయమే కాదు!
అబ్బ దీనబ్బ
'సెల్ - ఫోన్' కూడా!

ఎవడి బతుకు
వాడిదైన సాక్ష్యం కావాలా!
నీ అరచేతిభూషణం
సెల్ - ఫోన్!

ప్రత్యక్ష విధాతవు
నువ్వేరా!
సెల్ - ఫోన్ సృష్టి కర్తా
హ్యాట్సాఫ్!

సునందామృతం

కాక త్రోటి బింబ న్యాయము-11

కాకము అంటే కాకి.త్రోటి లేదా త్రోటిః అంటే ముక్కు. కాకి త్రోటి అనగా కాకి ముక్కు.బింబః అనగా దొండపండు.

కాకేమో నల్లగా ఉంటుంది.దొండపండేమో చూడచక్కని ఎరుపురంగులో నిగనిగలాడుతూ వుంటుంది. ఈ రెంటినీ కలిపి చూసినప్పుడు నచ్చని వ్యతిరేక భావన మనసుకూ కళ్ళకూ కలుగుతుంది. కంటికి అస్సలు ఇంపుగా అనిపించదు.

రెండూ వేర్వేరుగా స్పష్టమైన తేడాతో, ఒకే దగ్గర సామ్యం లేకుండా కనిపిస్తూ ఉండడాన్నే ఈ కాకత్రోటి బింబ న్యాయము అంటారు.

దీనిని ఎక్కువగా వివాహ విషయంలో ఉపయోగించడం చూస్తుంటాం.

రంగు, రూపం అందంగా ఉన్న అమ్మాయినో లేదా అబ్బాయినో అనాకారిగా రంగు రూపం తేడాతో ఉన్న అబ్బాయికో లేదా అమ్మాయికో కట్టబెట్టినపుడు అంటే పెళ్ళి చేసినప్పుడు అక్కడికి వచ్చిన బంధుజనం ఈ న్యాయమును ఉదాహరణగా అనుకుంటూ ఉంటారు.

దీనినే తెలుగులో సామెతగ "కాకి ముక్కుకు దొండపండు" అంటాం.

ఇలా ఒకదానితో ఒకటి ఎలాంటి సారూప్యత లేని వస్తువులను ఒకే గాటకు కట్టి చూసినప్పుడల్లా "కాకి ముక్కుకు దొండ పండు" సామెత, ఈ "కాకత్రోటి బింబ న్యాయము" గుర్తొచ్చి పెదవులపై చిరునవ్వు విరియకుండా వుంటుందా!

-పురిమళ్ల సునంద
9441815722

తెరచిన అద్దం

ఒక్క నెల నుంచీ
ఉక్కపోత గురించి
ఒక్కతీరుగ మాట్లాడుకుంటున్నాం,
బాధలుపడుతున్నాం
కవితలు కడుతున్నాం
ఇదీ బయటి ఉక్కపోతనే మరీ మనసు
లోపలి ఉక్కపోత ముచ్చటేంది?
లోపల ఏం లేదనగలమా?
నెల మొదటివారం లో జీతం పడకపోతే
అప్పులవాళ్ళ పలకరింపుల ఉక్కపోత,
పడిన జీతం పదిరోజుల్లో ఐపోతే
ఖర్చులఉక్కపోత,
ఆదాయాన్ని అప్పనంగా మింగేసే
అధికధరల ఉక్కపోత,
అసలే కష్టాలంటే
ఆపై దాడిచేసే అనారోగ్యాల ఉక్కపోత,
పిల్లల చదువుల పెట్టుబడి
అమాంతంగా డబులైన
ఫీజుల ఉక్కపోత,
అంతా బానే ఉందనుకుంటే
రోజూ పయనించే వాహనం పాడైన
రిపేరింగుఛార్జీల ఉక్కపోత,
హమ్మయ్యా ఈనెల లో పండుగలేం లేవనుకుంటే
అపుడే పుట్టుకవచ్చే
ఆలుబిడ్డల పుట్టినరోజుల సంబురాల ఉక్కపోత,
నెల చివరివారం లో అప్పులసేకరణలో కలిగే
అవమానాల ఉక్కపోత,
ఇక
ఊపిరిని బిగవట్టి రోజులరోడ్డురోలరును
బలవంతంగా తోస్తుంటే
కత్తిమొన మీద నడుస్తున్న ఒత్తిళ్ళ ఉక్కపోత,
మధ్యతరగతి ఉద్యోగికి
కాలం తో సంబంధం లేదు
జీవితకాలమంతా ఉక్కపోతనే,
ఋతువులతో పట్టింపులేదు
అన్ని ఋతువులలోనూ
అదేపనిగా ఒకటే ఉక్కపోత!
ఇన్ని ఉక్కపోతల్లో నిత్యం ఉక్కిరిబిక్కిరి ఔతున్నా
ఆశలచినుకులను మాత్రం
లోలోపలా చల్లుకుంటునే ఉంటాడు,
రేపు నాదేననీ
భరోసా పందిళ్లు అల్లుకుంటూనే ఉంటాడు,
అందుకే అతని బతుకు తెరిచిన అద్దం,
అతడు ఒక నడుస్తున్న యుద్ధం!

-డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

నీవు సల్లగుండాలె

(వచన కథా కావ్యం-23)

పరీక్షల్లో
ప్రశ్నలకు జవాబులు రాయడమే కాదు
జీవితంలో
అనేక ప్రశ్నలు ఉదయించేలా చేసింది చదువు!
సమాజం క్షమాజం
అందరికీ సమానంగా
నీడనివ్వదెందుకనేది
అన్నిటికంటే పెద్ద ప్రశ్న!
కులాల కుంపట్లు
సమూహాలకు సంతోషాన్నిస్తున్నా
మనుషుల మధ్య గీతలు గీస్తున్నాయి
మతాల సంగతాలు
స్వతంత్రాన్ని కాలరాస్తూ
కుతంత్రాల రాగమాలపిస్తున్నాయి
వర్ణాల సంస్కారాలు
నిస్సర సౌందర్యాన్ని మసిబారుస్తున్నాయి
ఇవేవీ చదువులో లేవు
వీటిని అంతం చేసేందుకు
ఇంతకు ముందు నుంచే
ఎంతోమంది జీవితాలను ధారవోశారు.

పొగ చెట్టును
ఎవరు కోయగలరు?
ఎంతని కోయగలరు??
అయినా
ప్రయత్నాల యుద్ధం ఆగిపోలేదు
ఆగిపోనీరాదు!
ఊరికి ఉపకారం శవానికి అలంకారం
అని అందరూ అనుకుంటే
గుండిగలో పాలు పోసేది ఎవరు?
ప్రయత్నానికి ఫలితం
ఎప్పుడూ ఉంటది
ప్రయత్నించకుండా మిన్నకుండడం కంటే
ప్రయత్నించి విఫలం కావడం కూడా
ప్రయోజన కారి అవుతది.

అదే మార్గాన్నెంచుకుంది సరయు
ఉన్న ఊరికి సేవ చేయడం మరిచినందుకే
కన్నతల్లిని ఉపేక్షిస్తున్నాడు మనిషి
మనిషి తనానికి మంచితనానికి
కులం, మతం, వర్గం, వర్ణం
అడ్డంకిగా మారకుండా చూసుడే
ప్రస్తుత తరుణోపాయం...
అందుకే
ఆమె మనసూ, మేధస్సూ మమేకమై
మార్గాన్ని అన్వేషించడం మొదలుపెట్టింది
ఊరు తల్లికి బిడ్డ ఆత్మఘోష
వినబడట్లున్నది
'సరయు సల్లగుండాలె '
అని ఆరాటపడ్డది

-దోరవేటి
సెల్:9866251679

సాంప్రదాయాల సాలీడు గూడు..

సాంప్రదాయాల సాలీడు
విషగూటిలో చిక్కుకుని నువ్వు
బాధ్యతల భవబంధాల్లో బందీయై
నేను ప్రతిక్షణం విలవిల్లాడుతున్నాం..

దాన్ని ఛేదించుకుని
నువ్వు బైటికి రావాలనుకున్న
ప్రతిసారి నీ కాళ్లకు అది అడ్డం
పడుతోంది..

నేను బాధ్యతల్లో కొన్నింటిని
నిర్వర్తించుకుని
మరికొన్నింటిని తప్పించుకొని
రాగల్గిన నువ్వు రావడం
గగనమే..

వర్తమాన కష్టాల కడలిని
ఈదడం కంటే
భూతకాలపు జ్ఞాపకాల దుంగతో
వెనక్కి పయనించడమే సులువేమో..

వాస్తవాన్ని జీర్ణించుకోవడం
కష్టమే కాదొచ్చు కానీ
దాన్ని అంగీకరించడంలోనే
అర్థం చేసుకోవడంలోనే
జీవనపరిపక్వత దాగివుంది..

జీవనపయనంలో ఇలా
సంశయాల చౌరస్తాలో,
నింగివైపు చూస్తూ ఉండిపోయాను
నిరాశనిస్పృహల శూన్యధృక్కులతో..

మళ్లీ రేపు నేను గెలుస్తాననే
నమ్మకం లేదు
ఇలాగే ఆశల చిగురుతో
నిలుస్తాననే ఆశ లేదు..

-సర్పరాజ్ అన్వర్
9440981198

నేను నడుస్తూనే ఉన్నాను ...

నడుస్తూనే ఉన్నాను
నేను నడుస్తూనే ఉన్నాను
నడకొచ్చిన నా తొలి ఏటి
మొదటి అడుగు నుండి
ఇప్పటికి నాకు నిండిన
ఈ ఆయుష్షు ఏళ్ళు పండి
నడుస్తూనే ఉన్నాను
నేను నడుస్తూనే ఉన్నాను ...
అన్యాయం పంచిన
అగ్ని శిఖల మీంచి
అక్రమాలు నింపేసిన
కారుచిచ్చు మీంచి
నడుస్తూనే ఉన్నాను
నే నడుస్తూనే ఉన్నాను ...
అబద్ధాలు సంధించిన
అంబుల మొనలమీంచి
అరాచకం విడిచిన
ఆ ఘాడ ఆమ్లాల మీంచి
నడుస్తూనే ఉన్నాను
నేను నడుస్తూనే ఉన్నాను ...
అసూయ ఆవిష్కరించిన
అడవి ముళ్లులమీంచి
అక్కసుకు అడ్డంగా పగిలిన
గాజు ముక్కల మీంచి
నడుస్తూనే ఉన్నాను
నేను నడుస్తూనే ఉన్నాను ...

మోసం మాటుగా చాటుగ
ఆ ఉంచిన ఉచ్చులమీంచి
దగా దర్జాగా దరిజేర్చిన
దావానలం దాహాలమీంచి
నడుస్తూనే ఉన్నాను
నేను నడుస్తూనే ఉన్నాను ...

ఊపిరి ఉచ్ఛ్వాసంలో
ఉరిమే ఆత్మస్థైర్యాన్ని నింపి
వదిలిన నిశ్వాసంతో
అలసట అధైర్యాలను పంపి
నడుస్తూనే ఉన్నాను
నేను నడుస్తూనే ఉన్నాను ...

-వేంకట కృష్ణ ప్రగడ
విశాఖపట్నం

'తొలి తుది కళాకారుడు కవే'



తొలి తుది కళాకారుడు కవే. ఏ కాలం లోనయినా కవి తన భావా లకు తన హృదయానికి నిబద్ధుడయి ఉండడమే ముఖ్యం. ఏ కళారూపం విశిష్టమయింది గొప్పది అంటే చెప్ప డం కష్టం. దేని వ్యక్తీకరణ దానిదే. అయితే సాహిత్యంలో కవిత్వానికే ప్రధాన భూమిక' ఇట్లా సాహిత్యాని గురించి కవిత్వాని గురించి తన దయిన భావాలతో దశాబ్దాలపాటు నిలబడ్డ సాహిత్య విమర్శకుడు గోపీచంద్ నారంగ్.

ఆయన తనకున్న సాహిత్య భూమిక కళాత్మక దృష్టి సమగ్ర అవగాహనలతో గోపీచంద్ నారంగ్ ఉర్దూ సాహిత్యం మీద విశేషమయిన కృషి చేసి భారత్ పాకిస్తాన్ రెండు దేశాల మధ్య సాహిత్య వారధి గా నిలబడ్డాడు. విమర్శ తన ప్రధాన సాహిత్య ప్రస్తానమే అయినప్పటికీ ఆయన గొప్ప భావుకుడు. గోపీచంద్ నారంగ్‌కి భారత ప్రభుత్వం 2004లో పద్మభూషణ్ ఇచ్చి సత్కరిస్తే పాకిస్తాన్ ప్రభుత్వం ఆ దేశంలో అత్యంత విశిష్ట పురస్కారం సితార్-ఏ-ఇమ్తియాజ్ తో 2012 లో సత్కరించింది. ఆరంగ్ చైతన్యానికి నిబద్ధతకి ఇదే తార్కాణం.

1931 లో జన్మించిన నారంగ్ 2022లో మరణించారు.

గోపీచంద్ నారంగ్ గొప్ప జీవితాన్ని గడిపాడు, అవార్డులు మరియు అభినందనలతో నిన్డయిన జీవితాన్ని గడిపాడు. నారంగ్ సాహిత్యంలో జీవితకాల నిబద్ధతలో ఉన్నాడు, అది డైనమిక్, వినూత్నమైన మరియు మారుతున్న సామాజిక వాస్తవాలకు సజీవ అనుబంధం కలిగి వుంది

నారంగ్ 70 కి పైగా పుస్తకాలు వెలువరించారు. ఆయన ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్‌లలో రాసారు. ఆయన రచనలన్నీ తన అధ్యయనం, ఎప్పటికప్పుడు ఎగిసి వస్తున్న సాహిత్య సిద్ధాంతాలు అన్నింటిని అవపోసన పట్టి చేసారు. ఆయన సాహిత్యం విషయాల్లో ఎప్పుడూ వర్తమానం లో వుండేవారు. ఆధునికత అత్యానుదిక తలతో పాటు జానపద గ్రామీణ కళారూపాల అవగాహన కలిగి ఉండేవాడు. ఉర్దూలో ముఖ్యంగా ఖవ్వాలీ రూపాన్ని గొప్పగా ఆవిష్కరిం చారు. ఖవ్వాలీ A SYMPHONY OF CULTURE అని రాసాడాయన.

ఆయన 1993లో రాసిన STRUCTURALISM, POST-STRUCTURALISM AND EASTERN POETICS పుస్తకం సాధికారిక మయింది గా నిలబడింది.

'ప్రొఫెసర్ గోపీచంద్ నారంగ్' 1931 ఫిబ్రవరి 11 రోజున జన్మించాడు . నారంగ్ ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి ఉర్దూలో మాస్టర్స్ డిగ్రీ పొందాడు. 1958 లో పిహెచ్‌డి పూర్తి చేయడానికి విద్యా మంత్రిత్వ శాఖ నుండి రీసెర్చ్ ఫెలోషిప్ పొందారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చేరడానికి ముందు నారంగ్, సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో (1957?58) ఉర్దూ సాహిత్యాన్ని బోధించాడు. అక్కడ అతను 1961 లో రీడరయ్యాడు. 1963, 1968లో అతను విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు మిన్నెసోటా విశ్వవిద్యాలయం, ఓస్లో విశ్వవిద్యాల యంలో కూడా బోధించాడు. నారంగ్ 1974 లో న్యూ ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యా లయంలో ప్రొఫెసర్‌గా చేరాడు. 1986 నుండి 1995 వరకు ఢిల్లీ విశ్వవిద్యాల యంలో తిరిగి చేరాడు. 2005 లో, విశ్వవిద్యాలయం అతన్ని ప్రొఫెసర్ ఎమెరిటస్‌గా గుర్తించింది.

ప్రొఫెసర్ నారంగ్ ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో తన ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించాడు. అతను మిన్నెసోటా విశ్వవిద్యాలయం, ఓస్లో విశ్వవిద్యాలయం మరియు విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో కూడా బోధిం చాడు. విస్కాన్సిన్ తర్వాత, ప్రొఫెసర్ నారంగ్ జామియా మిలియా ఇస్లామియాలో బోధించడానికి భారతదేశానికి తిరిగి వచ్చారు. మరియు 1986లో ఢిల్లీ విశ్వవిద్యాల యంలో తిరిగి చేరారు.

అతను గాలిబ్, మీర్ తాకీ మీర్ మరియు తరువాత ఫైజ్ అహ్మద్ ఫైజ్ మరియు ఫిరాక్ గోరఖ్‌పురి రచనలను వివరించడానికి మరియు విశ్లేషిం చడానికి విస్తృతంగా పనిచేశాడు. అతను దాదాపు 70 పుస్తకాలు రాశాడు మరియు లెట్స్ లెర్న్ ఉర్దూ పేరుతో ఇంగ్లీష్ మరియు హిందీలో పిల్లల కోసం 10 పుస్తకాలను రూపొందించాడు.

అతను పాకిస్తాన్ ప్రభుత్వంచే ప్రతిష్టాత్మకమైన సితార-ఇ-ఇమ్తియాజ్ (స్టార్ ఆఫ్ ఎక్సలెన్స్) (2012) మరియు భారత ప్రభుత్వంచే పద్మభూషణ్ (2004) మరియు పద్మశ్రీ (1990)తో సత్కరిపబడ్డారు. వార్తా నివేదికల ప్రకారం, అతను భారతదేశం మరియు పాకిస్తాన్ అధ్యక్షులచే గౌరవించబడిన ఏకైక ఉర్దూ రచయిత. 1995లో, ప్రొఫెసర్ నారంగ్ తన సమగ్ర రచన శక్తియాత్, పాన్- శక్తియాత్ ఔర్ మష్రికీ షెరియత్ (నిర్మాణవాదం, నిర్మాణ నంతరవాదం మరియు తూర్పు కావ్య శాస్త్రం) కోసం సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్నారు.

'థింకింగ్ విత్ గాలిబ్': బహుళ-మత ఆలోచనలు దాడికి గురవుతున్న కాలానికి సంబంధించిన పుస్తకం అతను వ్రాసిన కొన్ని ఉర్దూ పుస్తకాలలో అమీర్ ఖుస్రూ కా హైందవి కలాం (అమీర్ ఖుస్రో సొసైటీ ఆఫ్ అమెరికా, చికాగో, 1987); గాలిబ్ (సాహిత్య అకాడమీ, ఢిల్లీ, 2013); కాఫుజ్-ఇ-ఆతీష్ జాదా (ఢిల్లీ, 2011); మరియు రాజిందర్ సింగ్ బేడీ (సాహిత్య అకాడమీ, ఢిల్లీ, 2009).

ప్రముఖ ఉర్దూ పండితుడు, సాహిత్య విమర్శకుడు మరియు సాహిత్య అకాడమీ మాజీ వైస్‌పర్సన్, ప్రొఫెసర్ గోపీ చంద్ నారంగ్ (91) జూన్ 15, బుధవారం నాడు యునైటెడ్ స్టేట్స్‌లో కన్నుమూశారు. అప్పుడు తను నార్త్ కరోలినాలోని షార్లెట్‌లో తన కుమారుడు డాక్టర్ తరుణ్ నారంగ్‌తో కలిసి నివసిస్తున్నాడు. నారంగ్ పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్ లోని దుక్కి అనే జిల్లాలో జన్మించాడు. బలూచి, పాష్టో, సంస్కృతం మరియు పర్షియన్‌లతో సహా వివిధ భాషలలో పండితుడు నారంగ్ కు అతని తండ్రి చిన్ననాడే సాహిత్యాన్ని పరిచయం చేసాడు. దేశ విభజన తర్వాత, నారంగ్ కుటుంబం ఢిల్లీలోని కరోల్ బాగ్‌కు మారారు.

ఆయన భారతీయ ఉర్దూ భాషా సాహితీ విద్వాంసుడుగా పేరెన్నిక గన్నాడు. ఆయన బహుభాషా కోవిదుడు. హిందీ, ఇంగ్లీష్ లలలో కూడా అనేక రచనలు చేశాడు. నారంగ్ సాహిత్య సిద్ధాంత కర్తగా పేరుగడించాడు. ఎన్నో విశిష్ట సాహిత్య బహుమానాలు అందుకొన్న ఆయనను భారత ప్రభుత్వం 2004లో పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. 2010లో భారతీయ జ్ఞానపీఠ్ సంస్థ వారు ఇచ్చే మూర్తిదేవి పురస్కారం, నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ (ఔలఖజఒ) డైరెక్టర్ గానూ, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు గానూ పనిచేసాడు.

నారంగ్ మొట్టమొదటి పుస్తకం (కర్ఫుదారీ దయలెక్ట్ ఆఫ్ ఢిల్లీ ఉర్దూ) 1961 లో ప్రచురించాడు. ఇది స్వదేశీ కార్మికులు, ఢిల్లీ చేతివృత్తుల వారూ మాట్లాడే మాండలికం యొక్క సామాజిక భాషా విశ్లేషణ..

నారంగ్ 2002 నుండి 2004 వరకు ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ యొక్క ఇందిరా గాంధీ మెమోరియల్ ఫెలో. ఇటలీలోని రాక్ఫెల్లర్ ఫౌండేషన్ బెల్లాజియో సెంటర్లో 1997 లో రెసిడెంటు. మజ్జిని బంగారు పతకం (ఇటలీ, 2005), అమీర్ ఖుస్రో అవార్డు (చికాగో, 1987), కెనడియన్ అకాడమీ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ అవార్డు (టొరంటో, 1987), అసోసియేషన్ ఆఫ్ ఏషియన్ స్టడీస్ (మిడ్-అట్లాంటిక్ రీజియన్) అవార్డు (యుఎన్, 1982), యూరోపియన్ ఉర్దూ రైటర్స్ సొసైటీ అవార్డు (లండన్, 2005), ఉర్దూ మార్కాజ్ ఇంటర్నేషనల్ అవార్డు (లాస్ ఏంజిల్స్, 1995), అలామి ఫరోగ్-ఎ-ఉర్దూ ఆదాబ్ అవార్డు (దోహా, 1998) పొందాడు. భారత దేశం, పాకిస్తాన్ అధ్యక్షులు గౌరవించిన ఏకైక ఉర్దూ రచయిత ఆయన. అల్లామా ఇక్బాల్‌పై చేసిన కృషికి 1977 లో నారంగ్ పాకిస్తాన్ నుండి రాష్ట్రపతి జాతీయ బంగారు పతకాన్ని అందుకున్నాడు.

భారతదేశం నుండి పద్మ భూషణ్ (2004), పద్మశ్రీ (1990) లను అందుకు న్నాడు. అలీఘర్ ముస్లిం విశ్వవిద్యా లయం (2009), మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం (2008), హైదరాబాద్ లోని సెంట్రల్ యూనివర్శిటీ (2007) నుండి గౌరవ డాక్టర్ ఆఫ్ లెటర్స్ డిగ్రీలను పొందాడు. నారంగ్ 1995 లో సాహిత్య అకాడమీ అవార్డు, 1985 లో గాలిబ్ అవార్డు, ఉర్దూ అకాడమీ యొక్క బహదూర్ షా జాఫర్ అవార్డు, భారతీయ భాషా పరిషత్ అవార్డు (రెండూ 2010 లో), మధ్యప్రదేశ్ ఇక్బాల్ సమ్మాన్ (2011), భారతీయ జ్ఞానపీఠ్ మూర్తి దేవి అవార్డు (2012) అందుకున్నారు. సాహిత్య అకాడమీ 2009 లో నారంగ్‌కు అత్యున్నత గౌరవం ఫెలోషిప్‌ను ప్రదానం చేసింది.

గోపీచంద్ నారంగ్ తన 92 వ ఏట అమెరికాలోని షార్లెట్‌లో కన్నుమూశారు. ఉర్దూ అధ్యయనాల శకం దాదాపు ఆయనతో ముగిసినట్టే. ఎందుకంటే అతను ఆధునిక కాలంలోని గొప్ప ఉర్దూ ఉస్తాద్‌లలో చివరివాడు. ఉర్దూ అధ్యాపకుడిగా, లోతైన రచయితగా, విమర్శకుడిగా, ఆకర్షణీయంగా మరియు అనర్గళంగా మాట్లాడే వ్యక్తిగా, సెమినార్‌లు, సింపోజియంలు మరియు విద్యాపరమైన జోక్యాలను అలసిపోని నిర్వాహకుడిగా, ఉర్దూ సాహిత్య విమర్శలో అలుపెరగని ఛాంపియన్‌గా నారంగ్ సుదీర్ఘమైన జీవితం గడిపారు. ప్రసిద్ధమయిన అధ్యాపక వృత్తిలో ఉన్నారు. భారతదేశంలో ఉర్దూ కోసం అనేక అంజుమాన్లు మరియు సంఘాల కంటే నారంగ్ తాను ఒంటరిగా చేసిందే ఎక్కువ, అతని ప్రచురణల జాబితా చూస్తే ఆయన కృషి ఎంత బలీయమైనది అర్థమవుతుంది. భాషా సిద్ధాంతం సాంస్కృతిక అంశాలపైన అనేక చిక్కులపై నారంగ్ చేసిన విశ్లేషణ విశిష్టమయింది.

మనుషులమధ్య అనుబంధాల్ని నిర్మించడానికి, సర్వమత సామరస్యాన్ని పెంపొందించడానికి, మిశ్రమ సంస్కృతికి పూర్వ చిహ్నంగా ఉద్భవించటానికి ఉర్దూ ఎంతగా సహకరించిందీ ఆయన రచనలు ఆవిష్కరిస్తాయి. ఉర్దూ భాషా సాహిత్యాలకున్న సహజమైన సామర్థ్యంపై ఆయన జీవిత కాలం విశ్వాసంతో వున్నారు. ఒక భాష పట్ల సాహిత్యం పట్ల ఆయనకున్న అభిమానం విశ్వాసం ఆరాధనా ఎన్నదగింది.



సాహితీ స్రవంతి

-వారాల ఆనంద్
9440501281

ఆశయం

ఆకాశమే
హద్దుగా
తారా చంద్రులే
సాక్షిగా
ఉషా కిరణాలే
ప్రేరణగా
సాగర కెరటమే
స్ఫూర్తిగా
ప్రగతి పథాలే
లక్ష్యంగా
నిత్యం సాగిపో ముందుకు
నీలో ఊపిరి ఉన్నంత వరకు
నీ ఆశయం నెరవేరేవరకు

-కయ్యూరు
బాలసుబ్రమణ్యం
7780277240

పుస్తకాలు ఎప్పుడూ

పుణ్య చరితలు సృష్టించు
పుస్తకము మస్తకభూషణము
హస్తభూషణం కాదు
పుస్తకాలు ఎప్పుడూ
జీవన విలువలకు ఆదర్శమైన నిలుచు
పట్టించు అక్షరాన్ని
పదగమనముతో స్వర్గమనముతో
అక్షరాలతో ఆవిష్కరించు
జ్ఞాన పరంపర కొనసాగించే
దివ్య హస్త భూషణం పుస్తకం
బుక్కు కల్చరు కావాలి కానీ
లుక్కు కల్చర్ వద్దు
పుస్తకము ఎన్నో శతాబ్దాల
యుగాల చరితకు నిధి
సమస్త శాస్త్రాలను అభ్యసించి
విద్యార్థులకు అవగాహన అవసరం
విజ్ఞానమే విశ్వానికి దిక్సూచి
మాట్లాడితే కవిత అక్షరం పాడితే
పదగమనం ఆడితే
క్రీడ ఆటల కూచిపూడి భరతనాట్యాల
పేరిణి శివతాండవముల
నాట్యగమనం
నటరాజ్యం తాండవం
అక్షరాలతో
మాల కడతాను అక్షరాలతో
అభినందన పత్రం రాస్తాను అక్షరాలతో
విశ్వానికి నైతిక ఆదర్శాలను
నేర్పుతాను.....
అక్షర ప్రేమికుని అక్షరంతో
సహజనం చేసేవాణ్ణి...

-ఆంజనేయశ్రీ
7702537453

రూకలు

స్వేదం చినుకులు
లెక్కపెట్టగలమా..?
చమట చుక్కలకు
విలువ కట్టగలమా...?
అభివృద్ధి మాటున దాగిన
బిందువుల రుణం తీర్చగలమా..?
ఎండ కన్నెరుగక సాగే
కార్పొరేట్ల మధ్య
బ్రతుకు బాట వేయగాలమా...?
కాలిన గూడుల గోడు
పాపం ఎవరిదో నినదించగలమా..?
పైసలు లేక పడక దొరకని నిరుపేద
నేల పాలు గాక ఇంకేమున్నది
వైద్యుడు దేవుడు ఆయెను
రూకలు లేక చూడకపాయేను
ప్రభుత్వ దవాఖానాల
దవా కరువాయేను
గేటు నుంచి రూము దాకా
జేబులు ఖాళీ అయేను..
సచ్చిన రూకలే
బతికిన రూకలు లేక
బయటికి రాలేని బతుకుల
వడ్డీల దందాల లో
పానం నిలువకపాయేను...

-పి.విశాలాక్షి.
9908435805

'జీవన పోరాటంలో.. జీవిత కథల సంకలనం' ఆవిష్కరణ

-పుస్తకాన్ని ఆవిష్కరించిన అడిషనల్ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సౌత్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో జీవన పోరాటంలో.. జీవిత కథల సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్ఏ రహీం అధ్యక్షత వహించారు. సమావేశానికి హాజరైన వారిని వేదికపైకి గగన్ కుమార్ ఆహ్వానించారు. సమావేశానికి ప్రారంభ సూచికగా గురజాడ అప్పారావు రచించిన దేశభక్తి గీతాన్ని రుక్కయ్య ఆలపించారు. ఎన్ ఏ రహీం మాట్లాడుతూ సామాన్యుల జీవిత కథలు కూడా రాయవచ్చని తమకు స్ఫూర్తి గ్రూపు ప్రోత్సహించి నడిపించడం వలన ఈ పుస్తకం మీ ముందుకు వచ్చిందని తెలిపారు. అందరూ చదవాలని కోరారు.

అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఇటువంటి ప్రకియ చాలా అరుదుగా జరుగుతుందని ఇంతమంది తమ జీవితాలను కథలుగా అని కాకుండా పూర్తిగా యాదార్థంగా రాశారని చెప్పారు. దీనికి బాధ్యుడు గుర్రం జాషువా చాలా గొప్పగా రాసి ప్రసిద్ధికెక్కారని చెప్పారు. ఇందులో ప్రతీ కథను చదవటం జరిగిందని, ముఖ్యంగా జ్యోతి తన జీవితాన్ని అద్భుతంగా ధైర్యంగా గొప్పగా చెప్పారని కొనియాడారు. అలాగే అనేక కథలోని సారాంశాన్ని వివరించి ఇది మంచి ప్రయత్నం అని చెప్పారు. ఇటువంటి కథల వలన ఆనాటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం కన్వీనర్ రాములు మాట్లాడుతూ ఎందరో ఆచరణలో పెట్టాలని ప్రయత్నిస్తారని కానీ స్ఫూర్తి గ్రూపు ప్రాప్తమే కాకుండా ఆచరించడం ఇటువంటి గొప్ప పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో ప్రయో జనకరమని చెప్పారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని చదివిన చాలా మంది ప్రముఖులు అరుదైన పుస్తకంగా వర్ణించారని చెప్పారని అన్నారు. పీ జ్యోతి మాట్లాడుతు ఇందులో రాసిన ప్రతి ఒక్కరు నిజాయితీతో నిబద్ధత క్రమశిక్షణతో జీవించిన విధానం చాలా గొప్పదని, అందులో నా జీవితంలో అంశాలను కూడా పుస్తకంలో రాయటం ఎంతో గర్వకారణంగా ఉందని చెప్పారు. అంతేకాకుండా పీబీ చారి రాసిన ప్రముఖ విజ్ఞానవేత్త పద్మభూషణ్ డా॥ ఎస్ రావు జీవితం ముందుగా ఉండటం, వారి కథకు సరసన తమ అందరి కథలు ఉండటం ఎంతో గౌరవాన్ని తెచ్చిపెట్టిందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా రచయితలు అందరికీ చేనేత కండువాలతో ఆత్మీయ సత్కారాన్ని అడిషనల్ కలెక్టర్‌చే గౌరవించారు. అడిషనల్ కలెక్టర్‌ను భూపతి వెంకటేశ్వర్లు, జ్యోతి, ఆత్మీయ సత్కారం చేనేత కండువాతో చేశారు. 21 మంది రచయితలు మా ట్లాడిన వీడియో రికార్డింగ్‌ను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. అనంతరం అభ్యుదయ ఆర్ట్స్ ఈసీఐఎల్ వారిచే కలహాల కాపురం హాస్య నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో 150 మంది పైగా పాల్గొన్నారు. శ్రీ జంపాల శ్రీ మన్నానారాయణ వందన సమర్పణ చేయటంతో సభా కార్యక్ర మం ముగిసింది. కార్యక్రమంలో కోమటి రవి, ప్రసాద్‌బాబు, జి.శివ రామకృష్ణ నాగయ్య, వెంకటసుబ్బయ్య, ప్రముఖ కవి రాధశ్రీ, ఆచార్యులు, రామిశెట్టి చైతన్య, గగన్ కుమార్, బంగారు సర్పింగరావు, మల్లేశం, పాష, పిల్లి వెంకటేశ్వర్లు, సురేష్, జయప్రకాశ్, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

పుస్తక సమీక్ష

అభినందించదగిన గ్రంథం "నీ కోసమే"

మానవ సమాజంలో కోల్పోతున్న విలువలు, వాస్తవాలను గుర్తించి ఒకానొక ధిక్కార స్వరంతో రచించిన గేయాలు రాఖీ కవిత్వం. ఇదివరలో భక్తి పరంగా చక్కని వచన కవిత్వాన్ని రచించి ఎందరో మన్ననలు పొందిన కవి వీరు. వీరి కలంలో సంకోచం కనిపించదు. ప్రతి అంశాన్ని కూలంకుషంగా చర్చించి, స్పృశించి, ఎంతో ఆలోచించి రచిస్తున్న నిత్య నృజనకారులు డా॥ గొల్లపల్లి రాంకిషన్. జన్మనిచ్చిన గోదావరి తీరం స్ఫూర్తిని పొందిన కవి అని చెప్పవచ్చు. అందుకే గోదావరి మాకు సిరి, తెలంగాణ మా ఊపిరి" అని అంటారు. నదీ అలలు కేవలం మనకు కనువిందే కాదు కలం విందు కూడా చేస్తాయని నిరూపించారు. అలల హెూరునుండే సంగీతం అబ్బింది అని అంటారు. నది సాహిత్యానికి వారధి అన్నట్లుగా వీరి కవిత్వం సాగుతుంది.

ఎన్ని జన్మలు ఎత్తినగాని మాయమ్మా/ నన్ను కన్నబుణమును తీర్చుకోలేను మాయమ్మా" అంటూ కన్నతల్లిపై, నానా నీవేలే త్యాగానికి ప్రతిరూపం/ నాన్నా నీవేమో ఈ ఉన్నతి తార్కాణం" అంటూ కన్నతండ్రిపై రచించిన కవితలు స్ఫూర్తి దాయకంగా ఉన్నాయి. తల్లిని, తండ్రిని తలుచుకుని రచించిన గ్రంథం ఏదయినా వారి ఆశీస్సులతో గొప్ప గ్రంథంగానే నిలిచిపోతుంది అనడానికి సందేహం లేదు. రాంకిషన్ కవిత్వంలో చాలా వరకు భక్తి ప్రగాఢంగా పరిఢవిల్లడం మనం గమనించవచ్చు. దేవతలను, దేవుళ్ళను నిత్యం కొలిచే ఈ భక్తి ప్రధానమైన కవితలు కూడా వీరి ఉన్నతికి కారణం అవుతాయని చెప్పవచ్చును. **"తొలిసారి చూసింది నిన్ను/ లక్ష్మీ నరసింహస్వామి మందిరాన/ అచేతనమైపోయింది నా కన్ను"** అంటారు. మరోచోట కొండగట్టు హనుమంతునిపై రాస్తూ "కొండగట్టు హనుమంతుని అందే తన పొందరంటికి సింహద్వారం" అంటారు.

ప్రతి మనిషికి పుట్టిన రోజు ఒక ఉపయోగపడే రోజుగా ఉండాలి అనుకుంటాము. ఆ రోజే ఏవేవో నిర్ణయాలు తీసుకుంటాం. కొన్ని వాగ్దానాలు చేసేసుకుంటాం. ఎంతవరకు అవి నిలుస్తాయో తెలియదు కానీ పుట్టిన రోజుని మాత్రం ఒక ప్రత్యేకమైన రోజు గా గడపాలని నిర్ణయించుకుంటాం. అందుకే వీరు అంటారు **"జన్మదినం కావాలి జగతికే సంబరం/ జనుల జేజే ధ్వనులే తాకాలీ అంబరం"** అంటూ పుట్టినరోజు సంబరాన్ని పురస్కరించుకుని రచించారు. అలాగే **" మా బాబు బంగారు కొండ/ నవ్వుతేనే ముత్యాల వాన/ ముద్దు మురిపాలె రతనాల కోన/ ఆటపాటలై వరహాల మూట / నోటి మాటలే తేనెల ఊట"** అంటూ బాబును వర్ణించడం పరిపాటే అయినా బిడ్డపై కలిగిన ప్రేమకు సాటిరాదనే విషయాన్ని చాటి చెప్పడానికి ఏదీ సాటి రాదనే చెప్పాలి.

మరోచోట ఉన్నట్టో లేనట్టో ఉండీ లేనట్లో అంటూ అర్థాంగిని కూడా వర్ణించడం చాలా ఆసక్తికరంగా ఉంది. **"ఔనన్నట్టో కాదన్నట్టో ఆ మౌనానికి అర్థం ఏమన్నట్టో/ బెడిసి కొట్టి తీరుతుంది ప్రతిపాదనేది చేసినా/ ఒడిసిపట్ట సాధ్యం కాదు తలక్రిందులు తపం చేసినా/ భార్యా బాధితులారా / మీకు నా సానుభూతి/ నొక్కి వక్కాణించగ నాదైన సహాయానుభూతి"** అంటూ చమత్కారంగా రచించడం చదువుతున్నసేపూ చిరునవ్వు తెప్పించింది.ఇంకోచోట "వివాహాన్ని గురించి ప్రస్తావిస్తూ **"ఎలా కలుపుతాడో భగవంతుడు భిన్నమైన స్వరాలను/ ఎందుకు ముడిపెడతాడో పరమేశ్వరుడు విభిన్నమైన మనస్త త్వాలను/ ఎంతటి బలమైనతాడో చెరోవైపు లాగినా తెగనే తెగదు/ ఎందుకీ మాలో పడతాడో తెలిసి వగచుట తగదు"** అనడం ఎంతో ఆలోచనలో పడేస్తుంది. వీటికి చక్కని పేరును సూచించారు. అదే సందర్భ మరియు బాంధవ్య గీతాలు అని. ప్రతి బంధాన్ని తలుచుకుంటూ రచి ంచిన ఈ గేయాలు ఎంతో ఆకట్టు కునేలా సాగుతాయి. అందునా జంట గురువులు, ప్రతిభావంతులు అయిన కీ.శే కొంటికర్ల నరసయ్య గారికి, కీ.శే. బ్రహ్మశ్రీ చాచం క్రిష్ణయ్యగారికి అంకితం ఇవ్వడం సముచితంగా ఉంది. వీటికి తోడు ప్రముఖ కవి గాయకుడు అయిన దేశపతి శ్రీనివాస్, ప్రముఖ గజల్ కవి సురారం శంకర్ గార్ల ముందు మాటలు మరింత విశ్లేషాత్మకంగా సాగి, ఈ గ్రంథానికి శోభను చేకూర్చాయి.

దాదాపు 110 గీతాలున్న ఈ గేయాల గ్రంథం అందరినీ చదివిస్తుంది. కోల్పోతున్న మానవ విలువలను మరొక్కసారి గుర్తుచేస్తున్న ఈ గ్రంథం అభినందింపదగినది.

ప్రతులకు:
గొల్లపల్లి రాంకిషన్
ఫోన్: 94949 94896

-శైలజామిత్ర
9290900879

జాగరూకత

మనసు పొరలను తట్టిలేపే
భావాలు అక్షరాకృతులౌతాయి.
అక్షరాకృతులన్నీ అమర్చుకుంటూ వెళ్తే
అద్భుత శిల్పాల ఆలయాలౌతాయి.

భగవంతుని అందమైన సృష్టిలో
మన చుట్టూ ఉన్నవన్నీ ప్రేరకాలౌతాయి
ఆలోచనలు అందమైన సృజనలౌతాయి
అందరిలో అవి రసాత్మకత ఆవిష్కరిస్తాయి.

భగవంతుణ్ణి వేడుకొనే ఆరాధనలు
రాగతాళయుక్తమైన భజనలౌతాయి
మనసును అవి ఎంతో పరవశింప జేస్తాయి
అలౌకిక చింతనతో ప్రశాంతతనిస్తాయి.

సృజన అనుసృజన ప్రతిభకు గీటురాళ్ళై
సాహితీ,కళారంగాలు వికసిస్తాయి
తప్పుతోవ పడుతున్న సమాజంలో
అంగడి సరుకులవటం చూసి విలపిస్తాయి

డాంబికాలు,పటాటోపాలు,ఆత్మవంచనలు
కుహనా భక్తుల భజనలౌతాయి
గ్రంథ చౌర్యాలు,సత్కారాదివ్యామోహాలు
మేథో మధన సృజనలకు తూట్లు పొడుస్తాయి,

సృజన-భజన ఎంత ప్రాసపదాలైనా
జాగరూకత అవసరమనే బోధ చేస్తాయి

-డాక్టర్ చక్రపాణి
యిమ్మిడిశెట్టి
9849331554

పుస్తక సమీక్ష

నా జీవన యాత్ర- చలపాక ప్రకాశ్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 885వ రోజు 'పలకరించిన తొలకరి' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'పలకరించిన తొలకరి' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

లేట్ రిజిస్టర్

విశ్వకార్యాలయంలో
ఉద్యోగిస్తున్న కొందరు
ఈ మధ్య
ఆలస్యంగా రావడం
ఆనవాయితీ చేసుకున్నారు
సంతకం పెట్టి
డ్యూటీ ఎగ్గొట్టడం
హాయిగా కునుకు తీయడం
అలవాటు చేసుకున్నారు.
ఏప్రిల్లో రావలసిన మండుటెండయ్య
మేలోగానీ అడుగు పెట్టలేదు
హాజరు పట్టికలో సంతకం పెట్టగానే
విసనకర్రతో విసురుకుంటూ
ఎటో నిష్క్రమించాడు.
జూన్ మొదటివారం
హాజరు వేస్కోవలసిన వానమ్మ
నాలుగోవారంలో పలకరించింది
తాపీగా పనిచేస్తోంది
డ్యూటీలో చేరీ చేరగానే
వాతావరణం చల్లగా ఉందని
టీ తాగేందుకు బైటికెళ్ళింది.
పరుగులు పెడుతూ
రావలసిన మబ్బయ్య
కర్ణాటక సరిహద్దులోనే
చాలా రోజులు
హరం వేసుకుని కూచున్నాడు
పేరుకు తగ్గట్టే
మబ్బుగా ఉన్నాడు
మెల్లిగా నడుస్తూ వచ్చి
హాజరు పట్టికలో
తీరిగ్గా సంతకం పెట్టాడు
చల్లదనం తగిలితే తప్ప
పని చేయడం కుదరదంటున్నాడు.
గ్లోబలయ్యా!
వీళ్ళందరికీ
లేట్ రిజిస్టర్ పెట్టవల్సిందే!
తోక కత్తిరించి
సమయానికి
హాజరయ్యేలా చేయాల్సిందే!.

-డా.రాయారావు సూర్యప్రకాశ్ రావు

కర్షకుడి ఆనందం

ఆదిత్యుని ప్రతాపం
అల్లల్లాడిన మానవాళి
ఏరువాక పున్నమి నాడు
పరవశించి భక్తి శ్రద్ధలతో
తాను నమ్మిన
పశు, భూమాత పూజచేసి.
పొంగలి, పరమాన్నం
నివేదన చేసిన ఫలితమే
తొలకరిజల్లని రైతన్న
మురిసి హలం పట్టి
పొలందున్ని విత్తు నాటి
రానున్నది బంగారు కాలమని.
కష్టాలుండవని
పంటలు బాగా పండి
ప్రజలు సంతసించినది చూసి
కల నిజమైందని
జగతిలో కర్షకుడి ఆనందం.

-ఆచార్య అయ్యల సోమయాజుల ప్రసాద్

మురిసిన ధరణి

అదిగో మబ్బు
ఇదిగో మొగులు
అంటూ ఏరోజుకారోజు
వేడిసెగలు తట్టుకోలేక
ఎదురుచూస్తున్న జనం
ఉవ్విళ్ళూరిస్తూ గడుస్తున్న కాలం!!
సన్నగిల్లిన ఆశలు వమ్ముచేస్తూ
ప్రవేశించిన నైరుతి
ఋతుపవనాలు వెంటేసుకుని
పలకరించిన తొలకరి
కురిసిన జల్లు
మెరిసిన తరువు
మురిసిన ధరణి!!.
ఆషాఢం వచ్చింది
ఆనందం తెచ్చింది
చల్లబడ్డ మనసులు
తొంగిచూస్తున్న విత్తులు!!.
ఏరువాక వెళ్లి ఇన్నాళ్లకు
ఏరి కోరుకున్న రైతన్న
కురిసిన జల్లులు
విరిసిన తనువులు
రాగాలు పలికే కోకిల
హాయిగా ఎగిరే పక్షులు
సంబురాల మదులు
బోనాలతో ఊరేగింపు
నవ్విన భూతల్లి!!.

- డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

రైతుల సంతసము

మిరుగు పూని పక్షం గడిచినా
వాన దేవుడు కనికరించకపాయే
వాపోయిన జనులు
తొలకరి పలకరింపుతో
ఆశలు చిగురించిన హృదులు.
తడిసి ముద్దయిన నేలతల్లి
పరవశించిన పచ్చని ప్రకృతి మాత
రైతన్నల కలల పంటలు
పొడిసిన సింగడి సోయగాలు
మోదమందిన చెరువులు.
భానుడి తాపానికి
అలమటించిన జనవాళి
రెండు చినుకులు రాక
చల్లబడ్డ వాతావరణం
సేద తీరిన జీవకోటి.
ఎక్కడో దాక్కున్న

ప్రవాహ ఝరి

మేఘాల రాగ వీణియ
వృక్షాల తీగలు మీటుతూ
వినిపించి కురిపించిన చినుకుల
సంగీతమయ ప్రవాహ ఝరి
భువిని పలకరించిన తొలకరి.

- ఆర్.ఎస్. వెంకటేశ్వరప్

తొలకరి రెండు చినుకులు

తొలకరి రెండు చినుకులు!
మండుటెండకు
ఆరిన పచ్చదనం!
నోరు తెరిచిన నేల తల్లి దాహం!
తొలకరి రెండు చినుకులు!
వడదెబ్బకు పెడబొబ్బలు పెట్టి!
సూర్యాగ్నికి సూరెక్కిన పాణాల బలికి!
తొలకరి రెండు చినుకులు!
రైతు ఎతికినా జాడలేని మబ్బు!
కండ్లల్ల ఆడిన జారిన
నీటి ధార
తొలకరి చినుకులకన్నాఎక్కువే!
తొలకరి రెండు చినుకులు!!
తొలకరి ఆడే ఆటకు!
పల్లె పాట ఆట!
పట్టణ జనం మునక!!
తొలకరి రెండు చినుకులకే!!,

-జె.నరసింహారావు

ప్రకృతి మురిపెం

సీస పద్యం: విత్తుకు మోహము వినయంగ యెదగను
మొక్కలు మ్రానుగామారియు యెదిగి
మబ్బుకు మక్కువ మట్టిని ముద్దాడ
మట్టి పరిమళమ్ము మంచిగాను ,
చినుకులు పుడమిని చేరాలనాత్రము
దాహము తీర్చగ ధరణిపైన
నది పురకలువేసి నర్తించిపారగ
మెట్టను చేరితే మెతుకు పండు.
ఆట వెలది: ప్రకృతికి మన పైన పక్ష పాతములేదు!
సంపదంతపంచు సమముగా ను!
పంచభూతములును పాటిగ రక్షించు!
జీవులన్ని బ్రతుకు జీవమెరిగి!!

-కనకయ్య మల్లముల

చత్రి జెర్సిన్న జోరు
బడికి వెళ్ళే పిల్లలు
ఆఫీసులకు వెళ్ళే ఉద్యోగులు
తప్పవు ఇక్కట్లు
రైతుల హృది హరివిల్లు.
కాలక్రమం తప్పిన
నిందించు జనులు
విధులు తప్పిన మనుషులకు
పరిధులు దాటుతున్న మానవాళికి
నిందించు వారెవ్వా ఎవరు
వాస్తవికత లోపించిన లోకం
కలికాల మహిమేమో.

- వీరకుమారి

అలౌకిక ఆనందాల చినుకులు

మలమల మండించిన ఎండల రవితేడుని
నల్లవోణి చుట్టిన నీలిమబ్బుల బుల్లి కౌగిలిస్తే
ఆత్మీయ ఆలింగనాల ప్రణయ ఫలాలు నేల జారగా
అలవిలేని అలౌకిక ఆనందాల చినుకులే తొలకరి.
వేదనతో బీడైన మనసు భూములను
కోరిన ఆత్మీయ అనురాగం సంగమించగా
మదివేణియలే సుస్వర సరాగరాగాలే పాడే
పరువాల ప్రేమపదనిసలకు తొలకరి నాడే.
హలాలతో భుజాలతో భవ్యంగా దున్నంగా
విత్తనాలు జల్లి వానలు భూగర్భజలాలతో తడపగా
ఏపుగా సొగసుగా పెరిగిన ధరాపొలాల
ఫలరూపమైన పంటే కర్షకుని స్వేదానికి తొలకరి.

- జగన్నాథ్ వెలిదిమళ్ల

ప్రకృతి హర్షము

సూర్యోదయం ఎంతో హాయి
చల్లటి గాలులు వీస్తూ
మబ్బుల నుంచి బద్దకంగా
సూర్య కిరణాలు
భూమాతను చేరుతూ
సన్నని చిరుజల్లులు పడుతుంటే
మనసంతా హాయి
ఆ పలకరింపులో ఎంతో హాయి
పువ్వుల్ని
ఆకుల్ని
కొమ్మల్ని
మొక్కల్ని
పలకరిస్తున్న ఆనంద హేల
అద్భుత ప్రకృతి ఈ తొలకరి
రైతన్నకు అమృత రవళి.

- నారుమంచి వాణీ ప్రభాకరి

వర్షానికి స్వాగతం

ఊరించిన నైరుతి
ఋతు పవనాలకి
ఎట్టకేలకు స్వాగతం
పులకరింప చేసిన
తొలకరి జల్లులు
జల్లులు జడి వానలు
ముందు ముందు.
రోళ్లు పగిలే రోహిణి ఎండలు
బీడు వారిన నేలలు
తొలకరి జల్లుకై
అంగలార్చే వసుధ
వర్షం వస్తుంది వస్తుందనే
గంపెడాశతో ఎదురుచూపులు
ఆశలు ఫలించి
తొలకరి మొదలు
రైతన్న హుషారుగా
భూమిని దున్ని
భూసారం పెంచి
వ్యవసాయానికి శ్రీకారం.
తొలి జల్లు పడింది
తొలకరి మొదలైంది
కరి మబ్బు చూసి
నడకలనే నాట్యంగా
మార్చే మయూరం
ఆకాశవీధిలో
సప్త వర్ణాల హరివిల్లు
చూసిన నా మనసు
ఆనందంతో పులకరించింది.

-మోటూరి శాంతకుమారి

"అహం పనికి రాదు" (కథ)

ఒక ఊరిలో రామయ్య అనే రైతుండే వాడు. అతను ప్రతి రోజు తన పొలానికి ఉదయం ఇంటి నుండి వెళ్ళి సాయంత్రం తిరిగి వచ్చేవాడు. అతను వెళ్ళే తోవలో ఒక మామిడి తోట ఉంది. ఆ తోటలో రకరకాల పక్షులు పిట్టలు ఉండేవి. అవి ఎప్పుడూ కిలకిల రాగాలతో ఎంతో ఆనందంగా ఉండేవి. ఆయన ప్రతి రోజు అదే తోవ నుండి వెళ్లడం వల్ల ఆ పక్షుల అరుపుల భావం తనకు అర్థమయ్యేది. తాను దగ్గరికి వస్తే ఒక మాదిరి, దూరం వెళ్తే మరో మాదిరిగా వాటి గొంతును మార్చి మార్చి అరిచేవి. దీన్ని బట్టి వాటి యొక్క భాష కూడా తనకు అర్థం అయిపోయింది.

ఇలా కొన్నాళ్లకు రెండు పిల్ల కాకులు ఒక చోట చేరి ముచ్చటిస్తూ ఉన్నాయి. వాటి దగ్గరికి ఓ రెండు గండు కోయిలలు వచ్చి వాటిని బెదరిస్తూ **"మీరు మా వాడలోకి ఎందుకు వచ్చారు. మీరు కంపు అన్నం తింటారు. శవాలను పీక్కు తింటారు. మీ ఆకారం ఎలా ఉంది డాంబర్‌లాగా నల్లగా"** అని ఇలా అనేక రకాలుగా వాటిని కించపరుస్తుంటే బాధపడతూ అక్కడి నుంచి తమ గూటికి వచ్చేసాయి.

సాయంత్రం తమ తల్లి వచ్చేంత వరకు బాధపడ్తూనే ఉన్నాయి. ఆహార వేటకై వెళ్లిన తల్లికాకి విచారంతో ఉన్నతన పిల్లల మొఖాల్ని గమనించి **"బిడ్డలూ ఏమైంది రా! ఇటువైపు గద్దలు గానీ పాములు గానీ, ఏమైనా వచ్చాయా? ఇంకెవరైనా వచ్చారా? ఏమైంది నాన్నలూ?"** అని అడుగుతున్నది.

జవాబుగా తమకు జరిగిన అవమానం గురించి చెప్పాయి పిల్లకాకులు. అవి అలా చెప్పగానే **"బిడ్డా! ఎవరి పాపాన వాళ్లు పోతారు మనకెందుకులే మనం ఇలాగే ఉంటాము."** అని చెప్పేసి పిల్లలకు సముదాయించ ప్రయత్నిస్తుంది. తల్లికాకి, చెప్పిన మాటలు వాటికి సంతృప్తి నివ్వలేదు.

"కోకిలకు తీయని రాగం ఎలా వచ్చింది. మరి మనకి ఎందుకు రాలేదు. వాటి పుట్టుక ఏంటి?" ఇలా అనేక అనుమానపు విషయాలు తెలుసుకోవాలన్న ఆలోచనతో ఆ రోజుకు ఆ కాకి పిల్లలు సైలెంటుగా ఉండిపోయాయి.

చూస్తుండగానే వేసవి కాలం వచ్చేసింది. దాదాపు రెండు నెలల కాలం గడిచిపోయింది. పిల్లలు ఎదిగి గుడ్లు పెట్టే దశకు వచ్చేశాయి. అదే గూట్లో గుడ్లు మొదలు పెట్టాయి. అప్పటికి అవి తలో గుడ్డు పెట్టాయి.

ఒక రోజు ఎవరూ లేరనుకుని వీరి గూటికి వీటిని అవమాన పరిచిన కోకిల వెళ్లి వచ్చింది. ఇది గమనించిన ఆ కాకులు వెళ్లి గూటిలోకి తొంగి చూశాయి. ఇంకేముంది అంతకుముందు రెండు గుడ్లు ఉంటే ఇప్పుడు ఇంకోటి ఎక్కువ అయ్యింది అంటే ఈ కోకిలే ఆ గుడ్డును పెట్టి ఉంటుందని గమనించి ఏమీ ఎరగనట్టు ఉండిపోయాయి.

తిరిగి మరునాడు ఎవరులేనిది చూసి కోకిల మళ్లీ గుడ్డు పెట్టాడానికి అదే గూటి వద్దకు రావడం గమనించిన ఆ పిల్లకాకులు దాన్ని వెళ్లగొట్టాయి. వాటికి భయపడ్డ కోకిల ఎక్కడో ఓ చోట గుడ్డు పెట్టేసి వెళ్ళింది. ఇలా అయ్యే సరికి ఆ బయట పెట్టిన గుడ్లుసరిగా పొదుగక పిల్లలు కాలేదు.

కానీ అంతకు ముందు వీటి గూటిలో పెట్టిన గుడ్లు కాకుల ద్వారా పొదిగింపబడి, కాకి పిల్లలతో బాటు ఆ కోకిల పిల్ల పచ్చేసింది. కాకి పిల్లలతో బాటు అది కూడా ఎంతో చక్కగా పెరుగుతోంది.అందులో పిల్ల కోకిల ఏదో తెలియడం లేదు. అయినా అన్నింటికీ ఒకే రకంగా పెంచాయి కాకులు చూస్తుండగానే ఆపిల్లలు కూత కూసే దశకు వచ్చేశాయి. ఇంకేముంది అప్పుడు కోకిల అరుపు పసిగట్టి ఆ పిల్లని ముక్కుతో పొడిసి వెళ్లగొట్టాయి కాకులు. ఇది గమనించిన ఆ పిల్ల కాకులు **"అమ్మా! చూసావా! మన చేత పెంచబడి మన ఎంగిలి మెతుకులు తిని పెరిగి పెద్దదైన ఈ కోకిలలు మనలనెంత హీనంగా అవమానించాయో?"** అని అంటుంటే..

"పోనీయండ్రా గరక తన్ని గాడిదే చెడిపోతుంది గానీ, గరక చెడిపోదుగా!. ప్రకృతిని పరిశుభ్రంగా ఉంచి మానవజాతిని ఆరోగ్యవంతులుగా ఉంచడంలో మనమే భాగస్వాములు, ఎక్కడైతే రోగకారక క్రిమీ కీటకాలు ఉంటాయో అక్కడ మనం వాటిని తినేసి ఆ ప్రాంతమంతా శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాం. మరణించిన మనిషి ఆత్మ సంతోషాని కోసం ఆ పిండాన్ని మనం తినిచచ్చిన వారికి సంతృప్తినీ కలిగిస్తాం."

ఇలా అనేక విషయాలు చెప్పు సముదాయిస్తున్న తల్లికాకి మాటలతో చిరాకేసి **"అమ్మ! నీవు ఆపుతావా; నీ కాకమ్మ కథలు. మన జాతిని కించపరిచే ఆ జాతికి తగిన గుణపాఠం చెబుతాం మేం చెప్పినట్టు విను, నీవు మరో మాట మాట్లాడకుండా ఉండు సరేనా?"** అంటూ గట్టిగా గదిరించి పెట్టే సరికి.

ఏంచేసేది లేక **"సరే లేరా! మీరేం చెప్తే అదే"** అని తల్లికాకి ఊరుకింది.

"అమ్మా! నీవు ఎట్లాగో గుడ్డు పెట్టే దశ దాటిపోయే వయసుకు వచ్చేసావు ముసలిదానివైపోయావు కదా! మేము చేసేదేదో గమనిస్తూ ఉండు అంతే" అని ఆ యువ కాకులు చెప్పాయి.

×××

ఆ యువ పిల్ల కాకులు ఊహించినట్టుగానే ఆ గండు కోకిలలు మళ్లీ ఒక రోజు కాకుల గూట్లో గుడ్లు పెట్టడానికి వచ్చాయి. ఇది గమనించిన ఈ కుర్ర కాకులు వెంబడించి వాటిని తరిమేశాయి.

ఆ కోకిలలు పెట్టే గుడ్లను తాము ఆపుకోలేక ఎక్కడో పెట్టేశాయి. ఏ రక్షణా లేని చోట పెట్టడం వల్ల గుడ్లను పొదిగే స్థితిలేక ఒక పిల్ల కోకిల కూడా పుట్టలేదు. అసలు సృష్టి ప్రసాదించిన పొదిగే గుణం వాటికి లేదు. ఇంకేముంది ఈ రెండు కాకులు చూపిన తెగువతో, కాకులు మొత్తం ఇదే పద్ధతిని పాటించడం వల్ల కోకిలల సంతానోత్పత్తి మొత్తం శూన్యం అయ్యే పరిస్థితికి వచ్చింది.

ఈ పరిస్థితిని గమనించిన కోకిలలు ఒక అత్యవసర సమావేశం ఏర్పర్చుకున్నాయి. దీనంతటికీ కారణంమైన గండు కోకిలను పిలిచి నానా చివాట్లు పెట్టి **"నీవు చేసిన తప్పును క్షమించమని ఆ యువ కాకుల ముందుకు వెళ్లి అడగమని"** తీర్మానం చేసుకొని మర్రి చెట్టు దగ్గర ఉన్న కాకుల చెంతకు కోకిలల గుంపు మొత్తం వెళ్లి విచారంగ నిలబడ్డాయి.

ఇది గమనించిన తల్లికాకి **"ఏంటి? కోకిలమ్మలూ ఇలా వచ్చారు ఏంటి విశేషం?"** అని అడిగింది.

కోకిలలు వణుకుతున్న గొంతుతో **"నమస్కారం నమస్కారం"** అని వినయంగా నమస్కరించాయి.

తల్లికాకి వాళ్ళకు ప్రతి నమస్కారం చేయగానే. **"ఏం లేదు మిత్రమా!ఆ మధ్య మా గండు కోకిల తెలిసీ తెలియక బుద్ధి గడ్డి తిని మీ పిల్లలను ఏవో అనరాని మాటలని కించపరిచినట్టు తెలిసింది. అలా చేయడం తప్పే దానికి తెలియదు. మాలాంటి తెలిసిన వారు ఏమైనా అంటే తప్పు పట్టుకోవాలి గానీ దానికి ఏం తెలుసు మీ గురించి, ఏదో తన గొంతును చూసి మురిసి పోతుందే తప్ప దయచేసి మమ్మల్ని క్షమించండి. మేము మిమ్మల్ని ప్రాధేయ పడుతున్నాము. మీరు లేకపోతే మాకు మనుగడే లేదు. మీరు కరుణించకపోతే మా జాతి అంతరించిపోతుంది. దయచేసి మమ్ము క్షమించండి. ఒక్కమాటలో చెప్పాలంటే మా జాతికి జీవం మీరే కదా..!'** అని ఇలా పలు విధాలుగా బతిమాలుకుంటుంటే..

వారి మాటలు ఏమాత్రం లెక్కచేయకుండా యువ కాకులు **"వారి ఈ నక్క విషయాలు వినకండి. వీరిలో మాకు మించిన వారు ఎవరూ లేరు అనే అహం ఉంది"** అంటూ తలోవైపు గోల చేశాయి.

తల్లి కాకి మాత్రం ఎంతో విశాల హృదయంతో **"కోకిలమ్మా! మా పిల్లలు అనేది వాస్తవమే కదా! మరి అంత నీచంగా మమ్మల్ని కించపరచడం సబబేనా? మాకూ ఆత్మ గౌరవం ఉంది."**

"ఇప్పుడు తమ అవసరం కోసం ఎన్నో నీతులు చెప్తారు. వారి మాటలు నమ్మకండి ఎప్పటికైనా మన గొంతు గురించి ఇలాగే కించపరిచే మాట్లాడుతారు వీళ్లు..." అని యువ కాకులన్నీ తిరగబడ్డాయి.

ఈ మాటల మధ్యలో కలిగించుకుంటు **"భవిష్యత్తులో మేమెవ్వరం అలా కించపరిచి మాట్లాడమని, మేమంతా మీ అందరితో కలిసిమెలిసి ఉంటామని, ప్రమాణం చెస్తున్నాం"** అని కోకిల గుంపు చెప్తూండగానే తమ కుడి రెక్కను ముందుకు చాచి **"మేమంతా మా జాతి మీద ఒట్టేసి చెబుతున్నాం భవిష్యత్తులో మీరూ మేమూ అంతా కలిసిమెలిసే ఉంటామనీ ఒకరినొకరం గౌరవించుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్నాం"** అని అంటున్న ఆ కోకిలల హృదయ విచారకమైన దృశ్యాన్ని చూసి, హృదయం చలించి "అంత మంది తాము ఒట్టేసి చెప్తున్నారు. పోనీయండిరా! ఎవరి పాపాన వాళ్లు పోతారు" అంటు వృద్ధ కాకి అనగానే

"సరే గానీ అసలు ఎందుకు వాళ్ళు పెట్టిన గుడ్లను మనం పొదగడం" అంటూ సమస్యను మళ్లి లేవదీశాయి కుర్ర కాకులు.

"ఆ విషయం నేను చెప్తా వినండి. ఈ ప్రకృతి తీయని రాగం పలకటం అయితే మాకు ఇచ్చింది, కానీపిల్లలను కనే సౌభాగ్యం మాకు ఇవ్వలేదు" అని వృద్ధ కోకిల చెప్తుంటే

ఆ మాటల మధ్య చొరవ తీసుకుని **"మనం పెట్టిన గుడ్లను ఒక చోట చేర్చుకొని ఒక సురక్షిత ప్రాంతంలో కనీసం 20 రోజులు నిద్రాహారాలు మాని కూర్చొని ఏ గాలి తగలకుండా మన రెక్కల చాటున పొట్టలోని తగు ఉష్ణోగ్రతను అందిస్తూ ఉంటే అవి పొదిగి గుడ్డు లోపలి ద్రవం గడ్డ కట్టి పిండమై బయటకు వస్తుంది. ఎలాగైతే మనిషి నవమాసాలు కడుపులో దాచి పెంచికంటుందో అలా.."** అని వృద్ధ కాకి చెప్తుంటే

"అదే ఆ భాగ్యమే ఈ ప్రకృతి మాకు ప్రసాదించలేదు" అని ఓ వృద్ధ కోకిల చెప్పింది. దీంతో రామయ్యకు అర్థమైన విషయం ఏమిటంటే ప్రకృతిలోని అన్ని జీవరాశులు దేనికి అదే ప్రత్యేకత కలిగి ఉంటుందని ఒకదాని ప్రత్యేకత ఇంకో దానికి రాదూ అని.

నీతి:నేనే గొప్ప అనే అహం పనికి రాదని తెలుస్తోంది అందుకే ఎప్పుడు అహం పనికి రాదు.

-దారం గంగాధర్
సెల్:9848384777

ఫోటోగ్రఫీ ఓ అద్భుత కళ

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పోటీలు తీసే సాధనంగా 'కెమెరా' మనందరికీ అనాదిగా పరిచయమే. తమ తమ డ్రాయింగ్ రూముల్లో గోడలకు వేళాడే ఫోటోలు తమ గత జీవితపు ముఖ్య సన్నివేశాలు, వేడుకలను నిత్యం గుర్తు చేస్తుంటాయి. ఫోటోగ్రఫీ అనగా 'వెలుతురుతో వ్రాయడం' అని, 'కెమెరా అబ్స్కూరా' అనగా 'చీకటి గది' అని అర్థం. 2017 వివరాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 1.2 ట్రిలియన్ డిజిటల్ ఫోటోలు అందుబాటులో ఉన్నాయని అంచనా. జీవితంలో ఓ భాగమైన కెమెరా ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏట 29 జూన్ రోజున "ప్రపంచ కెమెరా దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. డిజిటల్ యుగంలో నేడు ప్రతి ఒక్కరి చేతులో స్మార్ట్ ఫోన్ రూపంలో కెమెరా దాగి ఉంది. ప్రతి క్షణాన్ని కెమెరాలో బంధించడం, ప్రాణాలకు సహితం తెగించి అరుదైన ఫోటోలను సెల్ఫీల రూపంలో తీసుకోవడం అత్యంత ప్రాధాన్య అంశం అయ్యింది.

కెమెరా, ఫోటోగ్రఫీ చరిత్ర:

కెమెరా, ఫోటోగ్రఫీ చరిత్ర 1825లో హెలియోగ్రాఫ్ రూపంలో 'జోసెఫ్ నైసీ' చొరవతో ప్రారంభమైంది. 1839లో 'లూయిస్ జాఖీస్ డగ్యూరె' కృషితో ప్రథమ వెలసిపోని ఫోటోను తీయడంతో వారిని 'ఫోటోగ్రఫీ పితామహుడు'గా పిలుస్తున్నారు. ఫోటోగ్రఫీ రంగంలో స్థిరమైన ఫోటోఫిలిమ్ రూపకర్తగా 'జార్జ్ ఈస్ట్మన్' పరిశోధనలో 1888లో తొలి 'కొడాక్' కెమెరా ఆవిర్భవించింది. 1936లో జపాన్ దేశంలో 'కానన్' కెమెరా తయారుచేయబడి అమ్మకానికి వచ్చింది. 1989లో తొలి 'డిజిటల్ కెమెరా'ను జపాన్‌లోని 'ఫ్యూజీ' కంపెనీ వాణిజ్యపరంగా విడుదల చేసింది. 2010 వరకు మార్కెట్‌లో 'డిజిటల్ వీడియో కెమెరా' అందుబాటులోకి వచ్చింది. ప్రతి ఒక్కరి జీవితంలో ఫోటోల ప్రాధాన్యతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏట 29 జూన్ రోజున 'ప్రపంచ కెమెరా దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అత్యంత మేలైన డిజిటల్ కెమెరాలను నిర్మించిన కంపెనీగా 'కొడాక్'కు గుర్తింపు ఉన్నది.

జీవితంలో భాగమైన స్మార్ట్‌ఫోన్ కెమెరా:

వేడుకల్లోని సంతోష క్షణాలను బంధించడం, ప్రకృతి అందాలను బంధించడం, నేర ఘటనలకు సాక్షంగా నిలవడం, ముఖ్య సన్నివేశాలను భావితరాలకు అందించడం, సమాజహిత కార్యాలు, చారిత్రాత్మక ఘటనలు, సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులు లాంటి పలు సందర్భాలలో కెమెరాలు తీసే ఫోటోలు మనందరికీ తెలుసు. 2000 నాటికి స్మార్ట్ ఫోన్‌లో కెమెరా ఇమిడి ఉండడంతో సాంప్రదాయ కెమెరాలకు ప్రాధాన్యత తగ్గిందనే చెప్పాలి. కెమెరా లేకుండా నిన్నటి గుర్తులు సజీవంగా కనిపించవు. 'ఒక ఛాయాచిత్రం వేల మాటలకు సమాన అర్థాన్ని ఇస్తుంది' అనేది అతిశయోక్తి కాదు. గత స్మృతులకు నిలువెత్తు సాక్ష్యాలు ఛాయాచిత్రాలు. నేడు మన చేతిలో ఇమిడి ఉన్న స్మార్ట్ ఫోన్ల మాద్యమంగా 'సెల్ఫీ ఫోటోలు' తీసుకునే ఆధునిక సాంకేతిక ఉపకరనాలు మనకు చేరువైనాయి. కెమెరాతో ఫోటోలు తీయగలగడం అనేది ఓ అద్భుత కళ. ఒక చక్కటి ఛాయాచిత్రం ఓ అద్భుత మనోఉల్లాసానికి కారణం అవుతుంది. ఓ ఫోటో వేల ఏండ్లు చరిత్రకు సాక్షిగా నిలుస్తుంది. నేటి స్మార్ట్ ఫోన్‌లో ఇమిడి ఉన్న అత్యాధునిక కెమెరాను ఉపయోగించి నిత్యం ఎన్నో అద్భుత సన్నివేశాలను బంధిస్తున్నాం. నేటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన కెమెరాతో క్షణాల్లో ఫోటో తీయడం, వేల ఫోటోలను సేవ్ చేసుకోగలగడం, ఫోటోలను తిరిగి మెరుగుపరుచు కోగలగడం లాంటి వసతులు అందుబాటులోకి వచ్చాయి.

ప్రపంచ కెమెరా దినం సందర్భంగా మన స్మార్ట్ ఫోన్‌ను ఉపయోగించి పలు సన్నివేశాలను బంధించడం, మన ఫోటోలను సామాజిక మాధ్యమాల ద్వారా బంధుమిత్రులకు పంపించడం, కెమెరా వెలుకువలు తెలుసుకోవడం, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించడం, కెమెరా/ఫోటోగ్రఫీ కళ/నైపుణ్యం/సైన్స్/చరిత్రను తెలుసు కోవడం లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. కెమెరా ప్రాధాన్యతను గుర్తించి అవసర సందర్భాలలో పలు వేడుకలు/సమావేశాలు/సభలు/సంఘటనలు/ప్రకృతి రమణీయతలు/పండుగలు/సంస్కృతులు మొదలైన చిరస్మరణీయ సన్నివేశాలను బంధించే సదవకాశాలను అందిపుచ్చుకోవడానికి మనందరం ప్రయత్నిద్దాం.

(29 జూన్ 'ప్రపంచ కెమెరా దినం' సందర్భంగా)

నాగన్న పదాలు

నీడ నిచ్చును తరువు
పంట నిచ్చును చెరువు
ధరణి! మోయు మేరువు
ఓరి! నాగన్న.

చింత చేర్చును చితి
పితుర్లతో చెడు మతి
నిదానిస్తే సుకృతి
ఓరి! నాగన్న.

ప్రకృతికి పుత్రుడు
నిరంతర శ్రామికుడు
"బహుగుణ" స్మరణీయుడు
ఓరి! నాగన్న.

కోరికలా ? సహజం
తీరకనే ! సతమతం
శ్రమ శక్తే సఫలం
ఓరి! నాగన్న.

బిడ్డ కోడలు కాదు
కోడలు బిడ్డ కాదు
అత్త పాత్ర మారదు
ఓరి! నాగన్న

అత్త ఒక కోడలే
కోడళ్ళు రేపత్తలె
గ్రహిస్తే! వైరమెలే
ఓరి! నాగన్న

నింగిలోన సింగిడి
నేలపై బురుద మడి
రైతు ఎదన సందడి
ఓరి! నాగన్న.

స్త్రీలను గౌరవించు
దుర్బుద్ధి నెదురించు
సభ్యతకు తలవంచు
ఓరి! నాగన్న.

ఉంటే సౌభాగ్యవతి
లేక నిర్భాగ్యవతి
"తుదకు"! దౌర్భాగ్యవతి
ఓరి! నాగన్న.

-నెమలికొండ నాగేశ్వర్ రావు
8688553470

నా కోసం

అక్క నా కోసం
గోరింటాకు తెచ్చెనురా
అన్న నాకోసం
లడ్డులు తెచ్చెనురా
చెల్లి నా కోసం
పూలు తెచ్చెనురా
తమ్ముడు నా కోసం
గాజులు తెచ్చెనురా
నాన్న నా కోసం
బట్టలు తెచ్చెనురా
అమ్మ నా కోసం
గోరుముద్దలు చేసెనురా..

-ఎం. వెంకట

పైడి లక్ష్మయ్య, సంజీవ రెడ్డిలు నిస్వార్థ ప్రజా సేవకులు

– తమిళనాడు పూర్వ గవర్నర్ పీ.ఎస్.రామ మోహనరావు

పైడి లక్ష్మయ్య పాలనాధ్యక్షునిగా సాహితీ ప్రియునిగా పెరుపొందగా ఆయన కుమారుడు సంజీవరెడ్డి ఉన్నత పదవిలో నిరంతరం ప్రజా క్షేమం కోసం తపించిన వారుగా గుర్తింపు తెచ్చుకున్నారని ఇరువురూ నిస్వార్థ ప్రజాహితులు అని తమిళనాడు పూర్వ గవర్నర్ పీ.ఎస్. రామమోహన్‌రావు అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి, డాక్టర్ పైడి లక్ష్మయ్య, పైడి సంజీవ రెడ్డిల స్మారక పురస్కార ప్రదానతోత్సవ సభ శనివారం త్యాగరాయ గాన సభలో జరిగింది. ముఖ్య అతిథిగా రామమోహనరావు పాల్గొని సాహితీవేత్త డాక్టర్ అనంత పద్మనాభరావుకు కవి బిక్కికృష్ణకు, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా॥నాళేశ్వరం శంకరంకు స్వర్ణ భారతి ట్రస్ట్ నిర్వాహకులు దీప వెంకట్‌కు బహూకరించి అభినందించారు. అధ్యక్షత వహించిన శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం విశ్రాంత ఉప కులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ పైడి లక్ష్మయ్య బహుభాష కోవిదులు సంజీవరెడ్డికి తగ్గ తనయులు అని కొనియాడారు. డాక్టర్ రాము స్వాగతం పలికిన సభలో నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి తొలుత సలాది మృణాళిని శిష్యులు భగీరథ విలాసం రస రమస్యంగా నర్తించారు. ఎం.కె.ఆర్.ఆశ లత వ్యాఖ్యానం ఆకట్టుకుంది.

పురస్కార గ్రహితలు బిక్కి కృష్ణ, డాక్టర్ అనంత పద్మనాభరావు, దీప వెంకట్, డా॥ నాళేశ్వరం శంకరంలతో అతిథులు నరసింహప్ప, పీ.ఎస్. రామమోహన్‌రావు, డా॥ కొలకలూరి ఇనాక్, కె. రామ, శ్రీమతి ఆశాలత

మొసలి కోరిక (కథ)

ఒక నక్క దాహం తీర్చుకుందామని ఒక మడుగుకు వెళ్ళింది. అది అబద్ధాలకోరు. అక్కడ అది నీటిలో దిగగానే ఒక మొసలి దానిని పట్టుకోబోయింది. అప్పుడు ఆ నక్క దానికి దొరకకుండా తెలివిగా తప్పించుకొని "ఓ మొసలీ! నన్ను నీ పైన ఎక్కించుకో! నీకు మంచి విషయాలు చెబుతాను "అని అంది . అప్పుడు ఆ మొసలి ఆ నక్క మాటలు నమ్మి అలాగే దానిని తన పైన ఎక్కించుకుంది. తర్వాత ఆ నక్క మొసలితో " నీవు ఎప్పుడైనా ఎడారిని చూశావా! ఈ వేనవి అక్కడ బాగుంటుంది తెలుసా!" అని అంది. అప్పుడు మొసలి' అలాగా ! దానిని నేను ఇంతవరకు చూడలేదు" అని అంది. వెంటనే నక్క " అయితే ఆలస్యం చేయకు. వెంటనే వెళ్ళు" అని అంది . అప్పటినుండి ఆ మొసలికి ఎడారిని చూడాలన్న కోరిక దాని మనసులో బలంగా నాటుకుపోయింది. అది విన్న మొసలి సంతోషంతో నక్కను అటూ ఇటూ నీటిలో తిప్పి ఒడ్డు పైన వదిలిపెట్టింది.

ఆ తర్వాత అక్కడికి ఒక కోతి దప్పిక తో వచ్చింది. అది నీటిలోకి దిగిన వెంటనే మొసలి దానిని పట్టుకుంది. అది కోతితో "నాకు నీ పైన ఎక్కాలని ఉంది" అంటూ దాని పైకి ఎక్కింది . దాని బరువుకు కోతి మునగ సాగింది. అప్పుడు కోతి తెలివిగా " ఓ మొసలీ! నీవు నాలాంటి చిన్న జంతువులను ఎక్కడం కాదు. పెద్ద పెద్ద జంతువులను ఎక్కి మంచి మంచి ప్రదేశాలను చూడాలి. అంతేగానీ నా వంటి చిన్న జంతువుల పై ఎక్కి కూర్చుంటే ఏమి లాభం" అని అంది. అప్పుడు మొసలి ఆ కోతినుండి దిగి దానిని తన పైన ఎక్కించుకొని " ఓ కోతీ! ఎడారి ఎంతో అందంగా ఉంటుందని నక్క అంటుంటే విన్నాను. దానిని చూడాలని నాకు కోరికగా ఉంది. అది ఎలాగా!"అని కోతిని అడిగింది. అప్పుడు కోతి " నీ వెర్రి గానీ! ఆ నక్క అబద్ధాలకోరు. దాని మాటలు నీవు నమ్మకు. ఎడారిలో ఈ సమయంలో చాలా వేడిగా ఉంటుంది. నీవు తట్టుకోలేవు" అని అంది . అప్పుడు మొసలి " అదేం కాదు. నాకు ఎందుకో అక్కడికి వెళ్లాలని ఉంది. అది ఎలాగో చెప్పు"అని అంది. అప్పుడు కోతి " ఆ....ఏముంది? ఏదైనా ఒక ఒంటెను ఎక్కి వెళ్లితే సరి! "అని అంది. ఆ తర్వాత ఆ మొసలి ఆ కోతిని ఒడ్డుపైన దించింది.

ఇంతలో ఒక ఒంటె నదిలో దప్పిక తీర్చుకొనుటకు వచ్చింది. అది రావడం చూసిన మొసలి " అదిగో ! ఆ ఒంటె వచ్చింది. నేను దానిపై ఎక్కి ఎడారికి వెళతాను"అని అంది. అప్పుడు కోతి"ఓ మొసలీ! నా మాట విను. ఈ ఒంటె కన్నా ఏ ఏనుగు పైననోలేదా గుర్రం పైననో ఎక్కి ఈ చుట్టూ ఉన్న పరిసరాలను చూడడం మంచిది. ఆ కొండలు, వాటిపైనుండి పడే జలపాతాలు, ఆ నింగి లోని మబ్బులు, ఆ ఆకుపచ్చని చెట్లు ఈ ప్రకృతి అందాలు చాలా బాగుంటాయి. వాటిని చూడు. అంతేగానీ మనకు సరిపడని వాతావరణం గల ఆ ఎడారికి వద్దే వద్దు. అక్కడ నీకు ఇసుక తప్ప చూచేవి ఏమీ లేవు" అని అంది. కానీ మొసలి దాని మాటలను వినకుండా నక్క చెప్పిన ఆ ఎడారినే చూస్తానని ఒకే పట్టు పట్టింది. చివరికి విసిగిపోయిన కోతి " సరే నీ ఇష్టం. నీకే అనుభవమౌతుంది"అని అంది .

ఆ నీటి దగ్గరికి వచ్చిన ఒంటెతో ఆ మొసలి తనను ఎడారికి తీసుకుపొమ్మని చెప్పింది. ఆ ఒంటే సరేనని నీటిలోనికి దిగి తన దప్పిక తీర్చుకొని ఆ మొసలిని తనపైన ఎక్కించుకుంది . ఆ తర్వాత అది పరుగున ఎడారి వైపు వెళ్ళింది . అక్కడ ఆ మొసలి దాని పై నుండి అనుకోకుండా జారి ఆ ఇసుక లో పడింది. ఆ ఇసుక చాలా వేడిగా ఉంది. దానికి ఒళ్ళు అంతా కాలసాగింది . ఆ మొసలి దీనంగా అరుస్తూ " ఓ ఒంటే! నన్ను వెంటనే నా నివాసానికి చేర్చు. నేను ఈ వేడిని తట్టుకోలేను .నాకు చాలా దాహంగా ఉంది. ఇక్కడ త్రాగుదామంటే ఒక్క నీటి చుక్క కూడా లేదు. నీకు పుణ్యం ఉంటుంది " అని వేడుకొంది. దయగల ఆ ఒంటె వెంటనే దాన్ని తిరిగి ఎక్కించుకొని దాని మడుగు లోని నీటి వద్దకు చేర్చింది .

అప్పుడు మొసలి " నా మడుగే నాకు గొప్ప. ఇక్కడ ఎంతో చల్లగా ఉంటుంది . కోతి వద్దని చెప్పినా నేను వినకుండా బుద్ధి తక్కువై ఆ జిత్తులమారి నక్క మాటలను నమ్మి నేను ఎడారికి పోవడం నా తప్పు. ఉన్నచోటు విడిచి మోసకారులైన ఇతరుల మాటలను విని అక్కడ ఇంతకంటె బాగుంటుందని అనుకొంటే ఇలాగే అవుతుంది " అని నిట్టూర్చింది.

–సంగనభట్ల
చిన్న రామకిష్టయ్య,
9908554535

దశ దిశలా.. తెలంగాణ వికాస హేల

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు 2014 - 2023

ఐటీలో మేటి.. ..నా తెలంగాణ

వరల్డ్ టాప్ 5 టెక్ కంపెనీలు ఇక్కడే..

గూగుల్‌కు గుండెకాయ.. అమెజాన్‌కు ఆయువుపట్టు. నాడు బ్యాక్ ఆఫీస్.. నేడు బ్యాక్ బోన్. తెలంగాణలో ఐటీ గురించి ఆ మధ్య మంత్రి కేటీఆర్ అన్న మాటలివి. ఏదో ప్రాస కొద్దీ అన్న వ్యాఖ్యలు కావివి.. తొమ్మిదేండ్ల శ్రమకు ప్రతిఫలం. రాష్ట్ర ప్రభుత్వ కృషికి నిదర్శనం. కేసీఆర్ మార్గనిర్దేశానికి, కేటీఆర్ ఆచరణకు ప్రతిరూపం. ఎవరు అవునన్నా, కాదన్నా ఇది నిజం. గణాంకాలే అందుకు సాక్ష్యం. ఓ అంతర్జాతీయ కంపెనీ హైదరాబాద్‌కు వస్తుందన్నా, మనవాళ్లకు ఉద్యోగాలు దక్కుతున్నాయన్నా ప్రభుత్వం దగ్గర ఓ కార్యాచరణ ఉన్నది.. అదే రాష్ట్రాన్ని 'ఐటీ హబ్'గా మార్చేసింది.

ఆకాశమే హద్దు

1998లోనే అప్పటి ప్రధాని, స్వర్గీయ వాజపేయి చేతుల మీదుగా ఐటీ రంగం వృద్ధికి హైటెక్ సిటీని మాదాపూర్‌లో ప్రారంభించారు. అప్పటి నుంచి 15 ఏండ్ల పాటు నెమ్మదిగా విస్తరించిన ఐటీ రంగం, తెలంగాణ రాష్ట్రంలో 9 ఏండ్లలోనే రెట్టింపు స్థాయి వృద్ధి సాధించింది. అందుకు ఇక్కడికి తరలివచ్చిన పెట్టుబడులే నిదర్శనం. గూగుల్, యాపిల్, ఫేస్‌బుక్, అమెజాన్, ఓలా, వన్‌ప్లస్, ఒప్పో, మైక్రాన్ ఇలా పదుల సంఖ్యలో బహుళ జాతీయ కంపెనీలు తమ ప్రధాన వ్యాపార కార్యకలాపాల కేంద్రాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయి. అనేక సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలను హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

మూలమూలకు ఐటీ.. కొత్తగా గ్రిడ్ పాలసీ..

ఐటీని నగరవ్యాప్తం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది. ఐటీ పరిశ్రమలు ఈస్ట్ హైదరాబాద్ (తూర్పు) వైపు తరలించే ప్రయత్నంలో భాగంగా అవసరమైన ప్రోత్సాహకాలతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నది. ఇందుకోసం అవసరమైన రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పనపై దృష్టిసారించింది. హైదరాబాద్ గ్రోత్ డిస్పర్షన్ (గ్రిడ్)పాలసీలో భాగంగా ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న 11 పారిశ్రామిక వాడలను ఐటీ పార్కులుగా అభివృద్ధి చేసేందుకు ఆదేశాలను జారీ చేసింది. ఇందులో కూకట్‌పల్లి, గాంధీనగర్, బాలానగర్, మల్లాపూర్, మౌలాలీ, సనత్‌నగర్, ఉప్పల్, నాచారం, పటాన్‌చెరు (కొంతభాగం), రామచంద్రాపురం, కాటేదాన్ వంటి పారిశ్రామిక వాడలు ఉన్నాయి.

గ్లోబల్ స్టార్టప్ ఎకో సిస్టంలో తెలంగాణ

ప్రపంచంలోనే అతి పెద్ద స్టార్టప్ నివేదికగా చెప్పుకునే జీఎస్ఈఆర్-2022లో రాష్ట్రానికి స్థానం దక్కింది. గ్లోబల్ స్టార్టప్ ఎకో సిస్టంలో తెలంగాణ టాప్-10లో నిలవగా, అదే సమయంలో ఏషియన్ ఎకో సిస్టం ఇన్ అఫర్డబుల్ టాలెంట్‌లో 4వ స్థానంలో నిలిచింది. ఈ పురోగతికి టీ-హబ్‌తో పాటు టీఎస్ఐసీ, వీ-హబ్, టాస్క్, రిచ్, టీ-వర్క్, తెలంగాణ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ తదితర ఇంక్యుబేటర్ల నెట్‌వర్క్‌లు కీలకంగా మారాయి. అంతే కాదు.. అత్యాధునిక టెక్నాలజీల్లో మంచి నైపుణ్యం ఉన్నవారికి హైదరాబాద్ ఐటీ కంపెనీల్లోనే పుష్కలమైన అవకాశాలు లభిస్తున్నాయి.

టెక్ రారాజు హైదరాబాద్

- ఐటీ ఎగుమతులు 26%, ఉద్యోగాలు 24% వృద్ధి
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 లక్షల మందికి ఉపాధి
- మనవాళ్లకు ఉద్యోగాలు దక్కేలా సర్కారు చర్యలు
- దేశంలో స్టార్టప్ క్యాపిటల్‌గా నిలిచిన తెలంగాణ
- భారీగా పెరిగిన పెట్టుబడులు.. రెట్టింపైన కొలువులు
- ద్వితీయ శ్రేణి నగరాలకూ విస్తరించిన సాఫ్ట్‌వేర్

హైదరాబాద్: తెలంగాణ వచ్చాక రాష్ట్రంలో ఐటీ రంగ ముఖచిత్రమే మారిపోయింది. లక్షల మందికి ఉద్యోగావకాశాలతోపాటు ఐటీ ఎగుమతులు రెట్టింపయ్యాయి. దేశంలోనే ఐటీ రంగంలో పెట్టుబడులకు కేంద్రంగా తెలంగాణ నిలిచింది. 9 ఏండ్లలోనే ఐటీ రంగం రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలకు కూడా విస్తరించింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు దేశంలో ఐటీ అంటే బెంగళూరు పేరు వినిపించేది. అలాంటిది ప్రస్తుతం ఐటీ అంటే హైదరాబాద్ అనే స్థాయికి చేరింది. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరం కేంద్రంగా ఐటీ రంగం ప్రగతి పథంలో దూసుకుపోతున్నది. ఐటీ, ఐటీఈఎస్ కార్యకలాపాల కోసం వినియోగించే ఏ గ్రేడ్ ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లోనూ హైదరాబాద్ బెంగళూరును మించిపోయింది. ఇదంతా తెలంగాణ ప్రభుత్వ విధానాలు, పనితీరు వల్లేనని ఐటీ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఐటీ ఎగుమతులు 26 శాతం ఉండగా, ఐటీ ఉద్యోగావకాశాలు 24 శాతం వృద్ధి చెందాయి. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో స్థానం పొందిన 20కి పైగా బహుళజాతి కంపెనీలు(ఎంఎన్‌సీ) హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్నాయి. ఐటీ రంగానికి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రతి ఐదేండ్లకోసారి (2016, 2021)లో ఐటీ పాలసీలను రూపొందించి సమర్థంగా అమలు చేస్తున్నది. ఐటీ శాఖ పరిధిలో ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్‌ను ఏర్పాటు చేసి 8 టెక్నాలజీలను ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగిస్తున్నది.

తొమ్మిదేండ్లలో మూడు రెట్లు పెరిగిన ఐటీ ఎగుమతులు

- **స్టార్టప్ క్యాపిటల్**

టీహబ్‌తో వేల స్టార్టప్‌లు పుట్టుకొచ్చాయి. హైదరాబాద్ కేంద్రంగా స్టార్టప్‌లు తమ కార్యకలాపాలను నిర్వహిస్తూ, విశ్వవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు రచించుకుంటున్నాయి. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా జరిగిన టై గ్లోబల్ సమ్మిట్-100 ఎమర్జింగ్ స్టార్టప్‌ల జాబితాలో టీ-హబ్‌లోని 13 స్టార్టప్‌లకు చోటు లభించింది.

ప్రపంచ వ్యాప్తంగా 14 దేశాల్లోని 80 నగరాల్లో నుంచి వెయ్యికి పైగా స్టార్టప్‌ల నుంచి దరఖాస్తులు రాగా, 68 స్టార్టప్‌లు ఎంపిక య్యాయి. అందులో 13 స్టార్టప్‌లు టీహబ్‌వే కావటం విశేషం. అంతేకాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా ఇన్నోవేటర్ పేరుతో గ్రామ స్థాయిలో ఆవిష్కరణలు ప్రోత్సహించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఇందుకోసం ప్రత్యేకంగా తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్‌ను ఏర్పాటు చేసింది. స్టార్టప్ ఎకోసిస్టంను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ఇతర పట్టణాలకు విస్తరించేలా స్టార్టప్ తెలంగాణ పేరుతో ప్రభుత్వం (https://startup. telangana.gov.in) వెబ్ సైట్ ఆవిష్కరించింది. దాని ఫలితంగానే రాష్ట్రవ్యాప్తంగా 77 స్టార్టప్ ఇంక్యుబేటర్లు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వపరంగానే కాకుండా ప్రైవేటు రంగంలోని విద్యాసంస్థలు తమ ప్రాంగణాల్లో సరికొత్త ఆవిష్కరణలు చేసేవారికి ఒక వేదికను ఏర్పాటు చేశాయి. స్కూల్స్, ఇంటర్, డిగ్రీ కాలేజీలు, వర్సిటీలు తమ ప్రాంగణాల్లో ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేసి సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నాయి.

ప్రభుత్వ చొరవతో వేగంగా మార్పులు

హైటెక్ సిటీ, మాదాపూర్‌తో పాటు కొండాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, రాయదుర్గం ప్రాంతాల్లో ఐటీ మౌలిక సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. దీంతో నగరానికి పశ్చిమ దిక్కున ఉన్న ఐటీ కారిడార్ అటు కార్యాలయాలకు, నివాస ప్రాంతాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా మెట్రోను విస్తరించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐటీ కారిడార్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైలు మార్గాన్ని నిర్మించేందుకు ప్రత్యేకంగా సంస్థను ఏర్పాటు చేసింది. 31 కిలోమీటర్లకు డీపీఆర్‌ను ఢిల్లీ మెట్రో రైలు సంస్థ అధికారులతో రూపొందించి, రైలు మార్గాన్ని నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్నాయి.

తెలంగాణ కేంద్రంగా ఐటీ ఎగుమతులు, ఉద్యోగావకాశాలు

ఆవిష్కరణలకు అనుకూల వాతావరణం

తెలంగాణ ఏర్పాటైన కొత్తలో 3 స్టార్టప్ ఇంక్యుబేటర్లు, 200 స్టార్టప్‌లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం 77 ఇంక్యుబేటర్లు, 7 వేల వరకు స్టార్టప్‌లు ఉన్నాయి. 2016 నుంచి స్టార్టప్‌లను ప్రోత్సహించే కార్యక్రమాలను చేపడుతున్నాం. స్టార్టప్ రంగంలో విశేష అనుభవం ఉన్న వారితోనే టీహబ్, టీవర్క్స్, టీఎస్ఐసీ, రిచ్, వీ-హబ్ వంటి ఇంక్యుబేటర్లను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా నిర్వహిస్తున్నది. వాటి ద్వారా వేల మంది వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలు చేస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు టీఎస్ఐసీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

- డాక్టర్ శాంతా తౌటం, చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ)

జారీచేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ

సర్దుబాటు సీట్లపై జగన్ స్వంత సర్వే- 25 చోట్ల మార్పులు చేర్పులకు కసరత్తు

అమరావతి, జూన్ 28: ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పూర్తి స్థాయిలో జల్లెడ పడుతోంది.. గడప-గడపకు మన ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలోని 175 అసెంబ్లి స్థానాలు, 25 లోక్‌సభ సీట్లపై మూడు నెలల కోసారి ప్రశాంత్‌కిషోర్ నేతృత్వంలోని ఐ ప్యాక్ టీంలు సర్వే నిర్వహించి నివేదికలను అందిస్తున్నాయి. అందుకు అనుగుణంగా పార్టీ అధినేత, ముఖ్య మంత్రి జగన్ ఎమ్మెల్యేలను అప్రమత్తం చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల గ్రాఫ్‌కు సంబంధించి ఐ ప్యాక్ తుది సర్వే అక్టోబర్‌లో సమర్పించనుంది. ఇప్పటి వరకు 18 మంది ఎమ్మెల్యేలు వెనుకబడినట్లు గుర్తించారు. ఆయా నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకు కూడా సీఎం జగన్ ఇప్పటికే హెచ్చరికలు జారీచేశారు. తీరు మార్చకోకపోతే మార్పు తప్పదనే సంకేతాలు కూడా అందించారు. ఈ నేపథ్యంలో ఈసారి గడప-గడపకు మన ప్రభుత్వం సర్వేలో ఎంతమంది అభ్యర్థులు గ్రాఫ్ నిలబెట్టుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా కొన్ని చోట్ల ఎంపీలు అసెంబ్లిట సెగ్మెంట్ల నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు అధిష్ఠానం వద్ద ప్రతిపాదనలు కూడా చేశారు. రాష్ట్రంలో గత కొద్దినెలలుగా చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించటంతో ఆ స్థానాల్లో ధీటైన అభ్యర్థులను బరి లో నిలపాలని భావిస్తున్నారు. ఈ రకంగా మొత్తం 25 స్థానాల్లో ఎంపీ అభ్యర్థులకు ఎమ్మెల్యే టిక్కెట్‌తో పాటు కొందరు సిట్టింగ్ లకు ప్రత్యామ్నాయ నియోజకవర్గాలను కేటాయించాలని నిర్ణయించారు.

జస్టిస్ చంద్రకుమార్ కవిత్వాలు ప్రేరణ కలిగిస్తాయి

-ఆచార్య కొలకలూరి ఇనాక్

ముఖ్య అతిథి ఆచార్య కొలకలూరి ఇనాక్‌ని సత్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య, జస్టిస్ చంద్రకుమార్‌లు.

కవయిత్రి మంజూల సూర్యని సత్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య, జస్టిస్ చంద్రకుమార్‌లు.

డా॥ కే.జి. వేణును సత్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య, జస్టిస్ చంద్రకుమార్‌లు.

సభాధ్యక్షులు బిక్కి కృష్ణను సత్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య, జస్టిస్ చంద్రకుమార్‌లు.

సమాజాన్ని చైతన్య పరుస్తూ, అనుభూతిని అందించే కవిత్వాలను ఎక్కువ మంది రాస్తున్నారని, ఇది శుభపరిణామమని ఎస్వీ యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆదివారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాల్‌లో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డా॥ బి.చంద్రకుమార్ రాసిన **అమ్మ నాన్న నా చిన్ననాటి జ్ఞాపకాలు, ఎవరు నాకు తోడు?** పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. "ఎవరు నాకు తోడు?" పుస్తకాన్ని కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించి మాట్లాడారు. జస్టిస్ చంద్రకుమార్ రాసిన కవిత్వాలు ఎంతో ప్రేరణ కల్గిస్తాయన్నారు. జీవితం సంపూర్ణం కావడానికి తల్లిదండ్రులే ప్రధాన కారణమన్నారు. న్యాయవాదులు కవిత్వం రాయడం చేస్తే కవిత్వానికి న్యాయం జరుగుతుందని అన్నారు. హైకోర్టు మాజీన్యాయమూర్తి మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ జస్టిస్ చంద్రకుమార్ హయాంలో ఎన్నో సామాజిక తీర్పులు ఇచ్చారన్నారు. మన నాల్గు వేదాలతో పాటు మరో రెండు వేదాలు తెలుసుకోవాలి. అయిదవ వేదం మహాభారతం , ఆరవ వేదం భారత రాజ్యంగం. మొదటి ఐదు వేదాలు పఠించకున్న ఆరవ వేదం భారత రాజ్యంగం ప్రతి వ్యక్తికి పఠిస్తే సమాజ స్థితిగతులు అర్థమయ్యి మన బాధ్యతను గుర్తుచేస్తూ కృషి చేయడానికి దోహద పడుతుంది. ఇపుడున్న పరిస్థితుల్లో భారత రాజ్యాంగం పఠించడం అవసరం కూడా అన్నారు.కవికి మూడు లక్షణాలుండాలని ఆధ్యాత్మిక చింతన, ప్రేమ చింతన, సేవ చింతన. ఈమూడు లక్షణాల అంతర్యానికి తపించే వాళ్ళతో సమాజ అభివృద్ధికి దోహద పడుతుందని తెలిపారు. ఇవన్నీ జస్టిస్ చంద్రకుమార్‌తో వున్నాయి కాబట్టి మంచి కవిత్వం రాయగలు గుతున్నారని సమాజం కోసం కృషి చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. "అమ్మ నాన్న నా చిన్ననాటి జ్ఞాపకాలు" పుస్తకాన్ని ఆవిష్కరించిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నారాయణ మాట్లాడుతూ జస్టిస్ చంద్రకుమార్ రాసిన రెండు పుస్తకాలు ఎంతో స్ఫూర్తిని నింపుతాయన్నారు.

తల్లిదండ్రులను ప్రేమించగలిగి నపుడే సమాజాన్ని ప్రేమించగలడు. మనిషి తన బాధ్యతను గుర్తెరిగి నలుగురికి సహాయపడగలడు. అలాంటి తత్వాన్ని పెంపొందించుకున్న ఆ గొప్ప మనిషి డా॥ బి. చంద్రకుమార్ అని, ఈ రోజు ఆవిష్కరింప బడిన ఈ రెండు పుస్తకాలు ప్రతి వ్యక్తిని ఆలోచింప జేస్తాయని ఇన్‌కంటాక్స్ కమీషనర్ జీవన్‌లాల్ లవాడియా చంద్రకుమార్‌ను అభినందించారు. తల్లిదండ్రుల మాట అందరూ వింటారని భార్య మాటకూ విలువివ్వాలని అది చంద్రకుమార్‌లో చూస్తున్నానని అన్నారు.

బాల్యంలో పిల్లల మనసులో నాటుకున్న విలువలు, వ్యక్తిత్వాలు వారి వారి జీవితాలకు మార్గదర్శకాలవుతాయని, అలా తన తల్లిదండ్రుల ప్రభావం జస్టిస్ చంద్రకుమార్‌పై వున్నాయని నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు. నీతికి, నిజాయితీకి కట్టుబడి ప్రజల క్షేమం కోసం తపిస్తున్న చంద్రకుమార్‌ను అభినందించారు.

ఇన్‌కంటాక్స్ పూర్వ చీఫ్ కమీషనర్ ఎం. నరసింహప్ప మాట్లాడుతు చంద్రకుమార్ జీవితం ఒక పాఠ్యగ్రంథమని ప్రతి విద్యార్థి చదవవలసిన పుస్తకమని అన్నారు. అవకాశం కల్పిస్తే ఈ పుస్తకాన్ని ప్రచురించి మా సంస్థ సభ్యులకు పంపిణీ చేస్తానని వెల్లడించారు. మొదట తాటికొండ కళ పర్యవేక్షణలో కవి సమ్మేళనం జరిగింది.

నిర్వాహకులు వక్తలు, కవులు, రచయితలను సత్కరించారు. కళారత్న డా॥బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు డా॥ కేజీ వేణు, జల్ది విద్యాధర్ రావు, మంజుల సూర్య, చంద్రకుమార్ రాసిన రెండు పుస్తకాలపై సమీక్ష చేశారు. జస్టిస్‌చంద్ర కుమార్ రాసిన భక్తి గీతాన్ని గాయకుడు రవీంద్రబాబు పాడి అందరినీ అలరించారు.

జీవితంలో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొన్నానని,వాటిని అధిగమించడానికి నా కుటుంబం నాకెంతో అండగా నిలిచిందని జస్టిస్ బి. చంద్రకుమార్ తన జీవిత నేపద్యం గురించి వివరించారు. విలువలకోసమే జీవిస్తానని సమాజంలో మార్పు రావలసిన అవసరం ఎంతైనా వుందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని కోరారు. సభకు విచ్చేసిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు.

పుస్తకావిష్కరణలో బైస దేవదాసు, జీవన్‌లాల్ లవాడియా, జస్టిస్ బి. చంద్రయ్య, జస్టిస్ పీఎస్ నారాయణ, డా॥ బిక్కి కృష్ణ, ఆచార్య కొలకలూరి ఇనాక్, జస్టిస్ చంద్రకుమార్,నరసింహప్ప, డా॥కె.జి.వేణు, తాటికొండ కళ, మంజుల సూర్య.

జస్టిస్ చంద్రకుమార్ -శ్రీమతి నర్మద దంపతులను సత్కరిస్తున్న అతిథులు.

జస్టిస్ చంద్రయ్యను సత్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, ఎం.నరసింహప్ప

కవయిత్రి తాటికొండ కళను సత్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య.

ఏసిపి రామదాసును సత్కరిస్తున్న జస్టిస్ చంద్రయ్య, జస్టిస్ చంద్రకుమార్‌లు.

సభలో ప్రసంగిస్తున్న పి.ఎస్. నారాయణ, జస్టిస్ చంద్రయ్య, జస్టిస్ చంద్రకుమార్, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఎం. నర్సింహప్ప.

నిలువెత్తు మానవతామూర్తి జస్టిస్ డా.బి.చంద్రకుమార్

మనుషుల నడవడిక వ్యక్తిత్వం, జీవితాంతం వారు పాటించే విలువలు తల్లితండ్రుల గుణగణాలపైనా వారి పిల్లల పెంపకంపై ఆధారపడి వుంటుందన్నది ముమ్మాటికి నిజం. బాల్యంలో పిల్లల మనసులో నాటుకున్న విలువలు వ్యక్తిత్వాలు వారి జీవితాలకు మార్గదర్శకాల వుతాయి. జీవితాన్ని మంచి మార్గంలో నడిపే మూల విలువలు, దయ, కరుణ, ఆత్మవిశ్వాసం, మానవత్వం, అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యం సాహసాలు, దృఢ నిశ్చయం, నీతి, నిజాయితి, కృతజ్ఞత, ఆధ్యాత్మిక జీవితం. పిల్లలు తమ బాల్యం నుండే తల్లిదండ్రులను అనుకరించడం వారి హావభావాలు, వారి మాటలు, వారు పాటించే విలువలు పిల్లల లేత మనసులలో నాటుకుంటాయి. ఆ విలువల విత్తులు మొలకెత్తి మనిషితోపాటు పెరిగి పెద్దవై వారి వ్యక్తిత్వానికి ఊపిరిపోస్తాయన్నది చైల్డ్ సైకాలజిస్ట్‌ల, వ్యక్తిత్వ వికాస నిపుణుల వివరణ.

రిటైర్డ్ జస్టిస్ డా.బి.చంద్రకుమార్‌గారు సాహిత్య సమావేశాల ద్వారా నాకు పరిచయం. ఈ మధ్య నాకు పంపిన వారి రెండు పుస్తకాలు "అమ్మనాన్న- నా చిన్ననాటి జ్ఞాపకాలు', "ఎవరు నాకు తోడు?" ఆసాంతం చదివిన తరువాత వారి నిలువెత్తు వ్యక్తిత్వానికి, మానవతా విలువలకు విత్తులు నాటినవారు వారి తల్లితండ్రులు రామచందర్, భగీరతీబాయిగార్లు అన్న విషయం విదితమయింది.

'అమ్మ నాన్న- నా చిన్ననాటి జ్ఞాపకాలు'లో చంద్రకుమార్‌గారు వారి వంశవృక్షం గురించి వివరిస్తూ వారి తల్లితండ్రుల పెంపకంలో వారెట్లా నీతి నిజాయితీ అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తిగా ఎదిగారో వివరించారు. ఒక విధంగా ఆ 60 పేజీల చిన్న పుస్తకం వారి 'స్వీయ చరిత్ర' అనవచ్చు. వారి తండ్రి రామచందర్ ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, నిజాయితీ, మానవత్వ లక్షణాలు పోతపోసిన స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తిగా మనకు దర్శనమిస్తాయి. రామచందర్ తన మనసుకు మంచిదని తోచిన, తాను నిర్ణయించుకున్న మంచి కోసం తండ్రి సంపాదించిన వందల ఎకరాలను కాదని పెళ్ళయిన మూడు రోజులకు కట్టుబట్టలతో భార్య భగీరతీబాయితో వారి ఊరు నర్సాపూర్ నుండి 'అదిలాబాద్ వచ్చి కష్టాలను ఎదుర్కొని ఎవరిదగ్గర చేయిచాచకుండా తమ జీవితాన్ని దిద్దుకున్న ఆత్మాభిమానం గల నిజాయితీపరుడు తాను ఉద్యమంలో పాల్గొన్నానని నిజం చెప్పి తన ఎఎస్సై ఉద్యోగానికి దూరమయిన సత్యదృష్టిగల స్వతంత్రభావాలుగల తండ్రి వ్యక్తిత్వం చంద్రకుమార్‌గారిపై బలమైన ప్రభావాన్ని చూపి వారి గుణగణాలను వ్యక్తిత్వాన్ని మలిచిందంటారు పేదరికాన్ని సంతోషంగా అనుభవిస్తూ తరువాత ఉపాధ్యాయ వృత్తిధర్మాన్ని సంపూర్ణంగా విద్యార్థుల వ్యక్తిత్వాన్ని, భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి పాటుపడిన తండ్రి రామచందర్ గారి అడుగు జాడలో చంద్రకుమార్‌గారికి మార్గదర్శకాలయ్యాయి. పేదల పక్షాన నిలబడిన ఆదర్శవాదిగా, కులమత భేదాలు పాటించని మానవతావాదిగా జస్టిస్ చంద్రకుమార్‌గారు వ్యవహరించారు. చంద్రకుమార్‌గారి తల్లి భాగీరతిబాయి కూడా మమత మానవత మూర్తీభవించిన మహిళామూర్తి. ఉన్న దానిలో ఇరుగు పొరుగున నలుగురికి పంచే దాన గుణం. అర్ధరాత్రి అపరాత్రి తన మన అనకుండా చంద్రకుమార్, వారి స్నేహితులకు వండీ పెట్టిన మాతృ హృదయం. చంద్రకుమార్‌గారు వారి తాతగారు (తల్లి తండ్రి) నుండి వారికి చిన్నప్పటి నుండే గాయత్రి మంత్రం, మృత్యుంజయ మంత్రాలు నేర్చుకున్నారు. వారు షిరిడి సాయిని తన ఆరాధ్య గురువుగా భావించి ఆ విశ్వగురువే తన చేయిపట్టి నడిపిస్తున్నారని 'విశ్వమే' నాకు తోడు అన్న భావనలో జీవించారు. వారిలోని నైతిక విలువలు, మానవత్వం, ఆదర్శ భావాలకు, ఆధ్యాత్మికతకు వారి కలం అక్షర రూపమిచ్చింది.

వారు రచించిన దాదాపు 15 పుస్తకాలు విద్యార్థుల ప్రగతికి ఉన్నత లక్ష్యాల సాధనకు, న్యాయవాదుల విజయాలకు, మానవత్వ విలువలకు, ఆధ్యాత్మిక ఔన్నత్యానికి మార్గదర్శకాలు.

'నాకు ఎవరుతోడు?' అన్న చంద్రకుమార్‌గారి కవితా సంపుటిని పరిశీలిస్తే అందులోని 56 కవితల శీర్షికలే వారి ఆదర్శభావాలను, విలువలను, ఆధ్యాత్మిక చింతనను ప్రతిబింబి స్తాయి. వారి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని, జీవిత విలువలను పాఠకులకు పరిచయం చేయడానికి కొన్ని కవితల నుండి ఉదహరించిన పంక్తులివి:

"ఎవరు నాకు తోడు"? నుండి
"రోజులు గడుస్తున్నాయి
ఆకలి వేస్తూనే ఉంది
అన్న-తమ్ముడు అన్నం పెట్టలేదు
బంధువులు బాధ్యత లేదన్నారు
కులం కూడు పెట్టలేదు మతం మాడు పెట్టలేదు
ఆచారం ఆకలి తీర్చలేదు
జాతి జాడ కనపడలేదు
రాష్ట్రాన్నడిగా దేశాన్నడిగా
నీవెవరన్నారు - అవును నేనెవర్ని
కాళ్ళు తడబడ్డాయి
కళ్ళు తిరిగిపోయాయి నాకింకెవ్వరు లేరని, కళ్ళు మూసుకున్నాను
చెట్లు చేమలు, వాగులు వంకలు
అడవులు కొండలు నదులు సముద్రాలు
సూర్యుడు చంద్రుడు చుక్కలు గిర్రున తిరుగుతూనే ఉన్నాయి
చల్లని గాలి వీచింది - కళ్ళు తెరిచి చూచాను
విశ్వాత్మ నా చేయి పట్టి నడిపాడు
... అది అంతంలేని ఆకాశం చెప్పింది - ఎక్కడికెళ్ళినా ఎప్పుడూ నీ తోడు ఉంటానని విశ్వం నాతో చెప్పింది..." ('ఎవరు నాకు తోడు')



దాదాపు 75 పంక్తులు ఉన్న ఈ మొదటి కవిత ఒక విధంగా చంద్రకుమార్‌గారికి అస్తవ్యస్తంగా మానవతా విలువలు లోపించిన ఈ లోకంలో నిరాదరణ నిస్పృహకు లోనయి 'నేనెవరిని.. నాకెవరు తోడు'ని హృదయ వేదనకు గురి అయినప్పుడు, 'విశ్వాత్మను'... ఈ విశ్వమే నీకు తోడు అని చేయిపట్టి నడిపించిన విశ్వాత్మ సాయి అనే తన అనుభవాన్ని వివరించిన కవిత ఇది. ఏ మనిషికైనా విశ్వజనీనత, వశుదైక కుటుంబం అనే ఏకత్వ భావన వారి విశ్వజనీన స్వభావానికి నాంది. చంద్రకుమార్‌గారిని తీర్చిదిద్దిన తల్లితండ్రుల గుణగణాలు, పెంపకం వారిలో నాటుకున్న నీతి నిజాయితి, కరుణ, దయ, మానవత్వానికి ఈ **'విశ్వం'** అదనపు అద్భుత ఆధ్యాత్మిక అనుభవాన్ని అందించింది.

"సహృదయం స్నేహాన్ని ప్రేమిస్తుంది
శాంతిని కాంక్షిస్తుంది
సామరత్వాన్ని స్వాగతిస్తుంది.. సఖ్యతను కోరుతుంది
విశాల హృదయంతో చూడు విశ్వాన్ని
విశ్వమానవునిగా వికసించనివ్వు నీ హృదయాన్ని' ("విభేదాలు విస్మరించి" కవిత) ఈ కవితలో సఖ్యతను, స్నేహాన్ని పెంచుకుని విశ్వమానవునిగా నీ హృదయాన్ని వికసించనీయని సందేశాత్మక కవిత వారి విశ్వజనీన తత్వానికి మచ్చుతునక ఈ కవిత.

"ఏమి నీవెంట తెచ్చావు
ఏమీ నీవెంట తీసుకెళ్తావు
ఎవరు నీ వెంట వచ్చారు
ఎవరు నీ తోడు వస్తారు...
నాలుగు రోజుల నాటకమనీ
ఇక్కడ నీవొక అతిథివని" ('ఏదీ నీవెంట రాదు... తెలుసుకోర సోదరా" పేజి-41) ఎలా జన్మించామో అలా రిక్తహస్తాలతో మరణించే ఒక నాటకం ఈ జీవితం, ఈ ఆరాట పోరాటం, స్వార్థం ఎందుకు, భూమిపై నీవు ఒక అతిథివనే భావనలో జీవించమనే బోధ ఇది. జీవిత సత్యాన్ని తెలిపే ఎంత మంచి కవిత!

"కష్టమెవరికో ఫలితమెవరిదో
త్యాగాలెవరివో - భోగాలెవరివో
సంపద సృష్టికర్తలెవరో సంపద భోక్తలెవరో
సమాధానం దొరకలేదా?
75 ఏండ్ల స్వతంత్ర భారతావనిలో
బాగుపడిందెవరో అర్థం కాలేదా?" "ఎవరు భారత పౌరులు" అన్న కవితలో సగటు భారతీయుని జీవితం బాగుపడినపుడే నాకు దసరా-దీపావళి-రంజాన్- క్రిష్టమస్. అంతవరకు సగటు మానవుని గతి ఇంతే అని కోట్ల ధనం దోచుకొని దాచుకుంటున్న భోక్తలను ఎండకట్టారు.

"అడుగడుగునా కుల అహంకార
దురహంకార దొరల పెత్తనం క్రింద
నలిగిన అభాగ్యులెందరో...
కులంకుళ్ళు మతం మురికి
మనిషిని మనిషిని కలిపేదే
నిజమైన మతం రా...
మానవత్వమే మంచి మార్గం రా..." "ఆత్మకు కులం లేదు"అనే కవితలో కులాల మతాల అహంకారాలను, భజన రాజకీయాలను నిరసిస్తూ మనిషిని మనిషిని కలిపే మానవత్వమే మంచి మార్గమనే సందేశాన్నిచ్చారు ఈ కవితలో.

చంద్రకుమార్‌గారు "ఎవరు నాకు తోడు?" 56 కవితల కవితా సంపుటి ఆణిముత్యాల లాంటి వ్యక్తిత్వ వికాస సందేశాత్మక కవితాక్ష రాలు కూర్చిన సుగంధభరిత కవితా కుసుమాల రాసి.

ఇలా రాసుకుంటూ పోతే ఈ కవితా సంపుటి లోని కవితలన్నీ ఆణిముత్యాలే చంద్రకుమార్‌గారి వివిధ ఆత్మకళల సమాహారాలే. నాకు జస్టిస్ చంద్ర కుమార్‌గారి వ్యక్తిత్వం పట్ల గౌరవం, మా భావసారూప్యత, త్రికరణ శుద్ధితో, నిజాయితీతో కూడుకున్న మానవ విలువలు, విశ్వగురువు షిర్డిసాయిట్ల వారికున్న అపార నమ్మకం, భక్తి నన్ను ఈ వ్యాసం రాయించాయి. జీవిత విలువలకు విలువిచ్చే నిలువెత్తు మానవత్వం స్వరూపాలయిన ఇటువంటి ఉన్నత వ్యక్తులు ఉన్నారని కవులు రచయిత్రులు ప్రజలకు అదే పాఠకులకు, భావితరాలకు వివరించడం బాధ్యతగా భావించాను.

ఈ వ్యాసం ద్వారా నాకు వారితో ఉన్న చిరు పరిచయం, వారు పంపిన పుస్తకాలు, కవితలు, వ్యాసాలు చదివి నేను ఆకళింపు చేసుకున్న వారి జీవిత చరిత్రను, మానవతా విలువల సమాహారమైన వారి వ్యక్తిత్వాన్ని అందరితో పంచుకున్నందుకు ఆనందిస్తూ.. ఈ సందర్భంగా నాకంటే ఏడు నెలలు పెద్దవార యిన సోదరులు జస్టిస్ డా.బి.చంద్రకుమార్‌గారికి శుభాకాంక్షలు, నమస్సులు తెలియజేస్తున్నాను.

-డా.పి.విజయలక్ష్మిపండిట్
8639061472

ఆహ్వానము
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
GVR CULTURAL FOUNDATION
డా॥ ఓలేటి పార్వతీశం గారికి
జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త డా॥ రావూరి భరద్వాజ
స్మారక సాహితీ పురస్కారం మరియు
శ్రీమతి పరిమళా సోమేశ్వర్ గారికి శ్రీమతి రావూరి కాంతమ్మ
స్మారక సాహితి సేవా పురస్కార ప్రదానం
పురస్కార స్వీకర్తలు
డా॥ ఓలేటి పార్వతీశం
సాహిత్యం
శ్రీమతి పరిమళా సోమేశ్వర్
సాహిత్యం
ముఖ్య అతిథి : డా॥ కె.వి. రమణ, ఐ.పి.ఎస్.(ర), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
సభాధ్యక్షులు : శ్రీ అలపర్తి రామకృష్ణ కథ, నవలా రచయిత
సభాప్రారంభం : శ్రీ శ్రీధర కథ, నవలా రచయిత
ఆత్మీయ అతిథి : శ్రీ పొన్నన నరసింహా రావు : అధ్యక్షులు, కళా నిపంచి
అతిథి సత్కారం : శ్రీ రావూరి వెంకట కోటేశ్వర రావు
డా॥ రావూరి భరద్వాజ & శ్రీమతి రావూరి కాంతమ్మ ట్రస్ట్
సాంస్కృతిక కార్యక్రమం : సంగీత విభావరి
గానం : శ్రీ శ్యామగాయత్రి మ్యూజిక్ అకాడమి
డైరెక్టర్, సంగీత గురువు శ్రీమతి చిల్లాశివపార్వతి
తేది: 05-07-2023, బుధవారం, ఉ॥ 10:00 గంటలకు
డా॥ కె.వి. రమణ క్యాంపు కార్యాలయం, నఫీజ్ రెసిడెన్సీ ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్.
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
గుబిబండి వెంకటరెడ్డి, ఛైర్మన్
వి.వి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి
డా॥ రావూరి భరద్వాజ & శ్రీమతి కాంతమ్మ ట్రస్ట్
రావూరి వెంకట కోటేశ్వరరావు
రావూరి సాయి సుమంత్

ఆకట్టుకున్న తెలంగాణ సాంస్కృతిక వైభవంపై కవితాగానం

తెలంగాణ సంస్కృతి వైభవం కవి సమ్మేళనం సభలో పాల్గొన్న వడ్డేపల్లి కృష్ణ, వంశీ రామరాజు, సుంకేపల్లి, శైలజ, మౌనశ్రీ మల్లిక్, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, కె. హరనాథ్, ఎన్వీ.రఘువీర్ ప్రతాప్ తదితరులు.

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాయ గానసభలోని కళా దీక్షితులు కళా వేదికలో నెల నెల తెలుగు వెన్నెల 175వ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంస్కృతి వైభవంపై కవి సమ్మేళనం జరిగింది.

ఈ కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు వడ్డేపల్లి కృష్ణ కోరుప్రోలు హరినాథ్, ఎన్.వి. రఘు వీర్ ప్రతాప్, రాపోలు సుదర్శన్, బెల్లం కొండ సంపత్‌కుమార్ పెద్దూరి వెంకట దాసు, రేడియమ్, మౌనశ్రీ మల్లిక్, దొరవేటి, రామదాసు, తులసి వెంకట రమణాచార్యులు, రాయారావు సూర్యప్రకాశ్ రావు, రామదాస్ మేన వత్, తెన్నేటి శ్యామకృష్ణ, రామకృష్ణ చంద్రమౌళి, మోటూరి నారాయణ రావు, గళ్ళపల్లి ఆంజనేయులు, పొత్తూరి సుబ్బారావు, అబ్దుల్ షాహిబ్, మామిళ్ళ లోక నాథం, సరోజ వింజామర, షామీర్ జానకీదేవి, జ్వలిత, పరిమళ సోమేశ్వర్, వాడపల్లి రాధ, అరుణ కుమారి, దాక్షాయని రెడ్డి పూరిణి, పొత్తూరి జయలక్ష్మి, గాజుల సుమలత, అరుణ కోదాటి ఉమాదేవి ఇల్లెందుల వీరంతా తెలంగాణ చరిత్ర, సాహిత్యం, జానపదం, కళలు, పండుగలు, వేషభూషణాలు, జాతరలు, ఆచా రాలు, సంప్రదాయాలు, జీవన శైలి ఈ అంశాలపై కవితలు చది వారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో సినీగీత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, మౌనశ్రీ మల్లిక్, సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు వీరం తా మాట్లాడుతూ అమెరికాలో స్థిరనివాసం ఏర్పరచు కొన్న చిట్టెన్ రాజు వంగూరి ఫౌండేషన్ సంస్థ ద్వారా తెలుగు సంస్కృతి సాహిత్యానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. కవి సమ్మేళనం నిర్వాహకుడు శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నెల నెల తెలుగు వెన్నెల పేరిట నిరంతరం తెలుగు సాహిత్య కార్యక్రమాలు 175 నిర్వహించి నట్లు తెలిపారు. సంకరపల్లి శైలజ తదితరులు సభలో పాల్గొన్నారు.

చిమ్నాలు

- న్యాలకంటి నారాయణ
9550833490

సమన్వయ లోపము
అభివృద్ధికి శాపము !
కలుపుకు పోవడము
అందరికీ క్షేమము !!

విత్తు నేలకంటి
చెట్టు నింగికెగసే !
ఆప్యాయతలంటి
మది ఊహలకెగసే !!

అనూహ్య ప్రమాదాలు
అకాల మరణాలు !
చెదిరిన బతుకులు
మరణ శకటం రైలు !!

కాలుష్య నివారణ
కాపాడు మనిషిని !
చెట్ల పై ఆదరణ
పెంచు సమతుల్యతని !!

మనసులో లక్ష్యము
వయసులో ఉరకత !
దరి చేరని గమ్యము
అలసిన ఉద్వేగత !!

గెలిచానని పొంగకు
ఓడానని కృంగకు !
ప్రవర్తన మార్చకు
ప్రయత్నము ఆపకు !!

ఎగసే కెరటమా...
చేరవా తీరము కు !

ఎగిసే స్నేహమా...
ఉండిపో తుదివరకు !!

పెద్ద నోటు బందు
పెద్దలకు గగ్గోలు !
ఎన్నికల ముందు
నలుపుకు సవాలు !!

వచ్చె మృగశిరము
తెచ్చె తొలకరి జల్లు !
వెలిగిన రైతు మోము
పంటలు విలసిల్లు !!

బడిగంట మోగింది
బాలల భవితకు !
బరువు పెరిగింది
కన్నవాళ్ళ శ్రమకు!!

మాతృ ప్రేమ

ఈ జగతికి వెలుగు అమ్మ ప్రేమ
తల్లి నవమాసాలు మోసి పురిటి
నొప్పులు తీసి జన్మనిస్తుంది
తన బిడ్డను చూసి మురిసిపోతూ
ప్రపంచాన్ని
గెలిచినంత సంబురంలో
కొత్త ఆశలతో
ప్రయాణిస్తూ నిస్వార్థంగా
సేవలు అందిస్తూ పసివాడి కళ్లలో
తన ఆనందం చూసుకుంటూ
ఒక ఇల్లాలుగాను మెలుగుతుంది
స్త్రీ జన్మ ఎన్నో జన్మల పుణ్య ఫలం
ఒక తల్లి వీరునికి జన్మనీయవచ్చు
ఉగ్రుపాలు పోసి పెంచిన తల్లి
దేశం కోసం
ధర్మం కోసం పోరాడమని
సంకల్ప బలం ఇచ్చేది అమ్మ.....
రాజైనా, ఖైదీ అయినా తల్లి ప్రేమకు
బానిసనే అదే పేగు బంధం....
తల్లి గొప్ప తనం గురించి రాయడానికి
మనము ఎంతటి వాళ్ళము
వారి ప్రేమ ముందు...

-మిద్దె సురేష్
9701209355

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.